పార్టీ ఎడ్యుకేషన్ సిరీస్

1

# గతి తార్కిక భౌతికవాదం

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

## పార్టీ ఎడ్యుకేషన్ సిరీస్ 1

# ముందుమాట

**భా**రత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఎడ్యుకేషన్ సబ్‌కమిటీ 2022 అక్టోబరులో సెంట్రల్ టీచర్ ట్రైనింగ్ స్కూలును నిర్వహించింది. ఆ స్కూలులో ఇచ్చిన నోట్స్‌ను క్లాసుల్లో చర్చలు, అభిప్రాయాలు ఆధారంగా ఫైనల్ చేయడం జరిగింది. అవసరమైన మార్పులతో మేము ఈ క్రింది నోట్స్‌ను ప్రచురిస్తున్నాము.

చారిత్రక భౌతిక వాదం లో మూడు అధ్యాయాలు ఉన్నాయి. ఒకటి, చారిత్రక భౌతిక వాదం, రెండు, భారత సామాజిక స్వరూపాలు, మూడు, మార్క్సిస్టు చారిత్రక అవగాహన – హిందూత్వ శక్తులు భారత దేశ చరిత్రను వక్రీకరించడం. ఈ మూడింటిని కలిపి కాని, విడివిడిగా కాని క్లాసులుగా అన్ని స్థాయిల్లోను బోధించేందుకు ఉపయోగించుకోవచ్చు.

ఈ నోట్స్ క్లాసులు బోధిస్తున్న వారికి ఉపయోగపడుతుందని, ఇతరులు సబ్జెక్టు గురించి అవగాహన చేసుకోవడానికి దోహదపడుతుందని ఆశిస్తున్నాము.

**పార్టీ ఎడ్యుకేషన్ సబ్ కమిటీ,**
**కేంద్ర కమిటీ, సిపిఐ(ఎం)**

**ఫిబ్రవరి 2023**

# గతి తార్కిక భౌతికవాదం

## పరిచయం

**తా**త్విక సిద్ధాంతాలన్నింటిలోకీ అత్యంత శాస్త్రీయమైనది, విప్లవాత్మకమైనది మార్క్సిస్టు తత్వ శాస్త్రం. కార్మికవర్గం తన విముక్తికోసం సాగించే పోరాటంలో చేతబూనే అత్యంత శక్తివంతమైన తాత్విక, సైద్ధాంతిక ఆయుధం మార్క్సిస్టు తత్వశాస్త్రం. చాలా సంక్లిష్టమైన సాంఘిక, రాజకీయ పరిణామాలలో సక్రమంగా వ్యవహరించడానికి అది కమ్యూనిస్టు పార్టీకి తోడ్పడుతుంది. వాస్తవ పరిస్థితిని శాస్త్రీయంగా విశ్లేషించి, కీలకమైన కర్తవ్యాలను స్పష్టంగా నిర్ధారించి, ఆ కర్తవ్యాలను సాధించడానికి అత్యంత శక్తివంతమైన మార్గాలను ఎంచుకోడానికి అది తోడ్పడుతుంది. అందుకనే, మార్క్సిస్టు తత్వశాస్త్రం గురించి లోతైన అవగాహన కలిగివుండడం ప్రతీ మార్క్సిస్టుకూ చాలా అవసరం. అప్పుడే సమాజంలో సమూలమార్పులకోసం సాగిస్తున్న క్లిష్టతరమైన వర్గ పోరాటంలో ప్రతీ ఒక్కరూ నిలదొక్కుకోగలుగుతారు.

### తత్వ శాస్త్రం అంటే ఏమిటి?

ప్రకృతిలో, సమాజంలో, ఆలోచనలో జరిగే పరిణామాలకు సంబంధించిన సర్వ సాధారణ నియమాలను గురించి తత్వ శాస్త్రం చర్చిస్తుంది. తన చుట్టూ ఉన్న పరిసరాల గురించి ప్రతీ మనిషీ ప్రయత్నపూర్వకంగానో, అసంకల్పితంగానో తెలుసుకునే ప్రయత్నం చేస్తూవుంటాడు. ఆ పరిసరాలలో జరిగే పరిణామాలను వివరించడానికి ప్రయత్నిస్తూవుంటాడు. ఆ క్రమంలో అందుకు సంబంధించిన సాధారణ భావాలు ఏర్పరచుకుంటాడు. ఆ విధంగా చూస్తే ప్రతీ వ్యక్తీ తాత్వికుడే ఔతాడు. ఐతే, ఆ భావాలు, – వాటినే మనం ఇంగితజ్ఞానం అని కూడా అంటాం – రకరకాలుగా, పరస్పరం భిన్నంగా ఉండే అంశాలతో అన్నీ కలగలిసిపోయివుంటాయి. వాటిలో ఏ విధమైన పొందికా లేకపోయినా, కొన్ని తాత్విక అంశాలు ఉంటాయి.

## వర్గ సమాజం– తత్వశాస్త్రం

తత్వ శాస్త్రం వర్గాతీతమైనదేమీ కాదు. దోపిడీ చేసేవర్గపు ప్రయోజనాలను రక్షించడానికో, లేదా దోపిడీకి గురౌతున్న వర్గాల ప్రయోజనాలను రక్షించడానికో తత్వ శాస్త్రం రూపొందింది. అందుచేత తత్వశాస్త్రం అంటే అది ఏదో ఒక వర్గ ప్రయోజనాలకోసమే ఉంటుంది. అది దోపిడీ వ్యవస్థను సమర్ధించడానికైనా పూనుకుంటుంది. లేదా దోపిడీ వ్యవస్థను మార్చగలిగే వర్గాలను ఆ మార్పు వైపు ప్రేరేపించేలా జోక్యం చేసుకుంటుంది. భావ వాదపు వివిధ స్రవంతులు సాధారణంగా పాలకవర్గాలకే తోడ్పడతాయన్నది చరిత్ర చెప్తోంది. దానికి భిన్నంగా భౌతికవాదం ఎప్పుడూ శ్రామిక ప్రజల తత్వ శాస్త్రంగానే ఉంది. బానిస సమాజంలో సద్యోజనితంగా తలెత్తిన భౌతికవాదం దోపిడీకి గురైన వారి తాత్విక దృక్పథంగా ఉంది. 17వ, 18వ శతాబ్దాలలో అప్పటికి బలం పుంజుకుంటున్న పెట్టుబడిదారీ వర్గపు తత్వ శాస్త్రంగా అధిభౌతికవాదం (మెటఫిజిక్స్) ప్రత్యేక పాత్రను పోషించింది. పెట్టుబడిదారీ సమాజంలో అత్యంత దోపిడీకి గురయ్యే శ్రామిక వర్గంగా ఉన్న కార్మికవర్గపు తత్వశాస్త్రంగా 19వ శతాబ్దంలో తలెత్తిన గతితార్కిక భౌతికవాదం ముందుకొచ్చింది. అందుకే పాలకవర్గాలు మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని తమకు అత్యంత ప్రమాదకారిగా పరిగణిస్తారు.

"యావత్తు నాగరిక ప్రపంచంలోనూ మార్క్స్ బోధనలు బూర్జువాశాస్త్ర (అధికారిక, ఉదారవాద పార్శ్వాలు రెండూ) శతృత్వాన్ని, విద్వేషాన్ని అతి తీవ్ర స్థాయిలో ఎదుర్కోవలసివస్తోంది. బూర్జువా శాస్త్రం మార్క్సిజాన్ని "అత్యంత హానికరమైన "తెగ" అని భావిస్తుంది. ఇంకో విధంగా వాళ్ల వైఖరి ఉంటుందని అనుకోలేం. ఎందుకంటే వర్గ పోరాటం మీద ఆధారపడిన సమాజంలో "నిష్పాక్షికమైన" సామాజిక శాస్త్రం అంటూ ఏదీ ఉండదు. అన్ని తరహాల అధికారిక, ఉదారవాద శాస్త్రాలూ వేతన బానిసత్వాన్ని సమర్ధిస్తాయి. ఆ వేతన బానిసత్వంపై మార్క్సిజం నిరంతరాయమైన యుద్ధాన్ని ప్రకటించింది. పెట్టుబడిదారుల లాభాలు తగ్గని విధంగా కార్మికుల వేతనాలను ఎందుకు పెంచకూడదు? అన్న ప్రశ్న మాదిరిగానే, వేతన బానిసత్వం ఉండే సమాజంలో నిష్పాక్షికమైన శాస్త్రం ఎందుకు ఉండదు? అన్న ప్రశ్న కూడా తెలివితక్కువ అమాయకత్వమే ఔతుంది". అని లెనిన్ రాశారు.

## తత్వ శాస్త్రంలో రెండు ప్రధాన స్రవంతులు

మొత్తం తత్వ శాస్త్రపు చరిత్రనంతటినీ అధ్యయనం చేస్తే భావవాదం, భౌతికవాదం అనే రెండు తాత్విక స్రవంతులు మనకు కనిపిస్తాయి. ఈ రెండూ గుణాత్మకంగా విభిన్నం. అంతేగాక, ఈ రెండూ ఒకదానికొకటి వ్యతిరేకం. పదార్ధమా

లేక చైతన్యమా – ఈ రెండింటిలో ఏది ప్రాథమికం? అన్న ప్రశ్నకు వాటివద్ద ఉన్న సమాధానాల ప్రాతిపదికన ఈ తేడా తలెత్తింది. ఇదే తత్వశాస్త్రపు మౌలిక ప్రశ్న. పదార్థం ప్రాథమికం అని, శాశ్వతం అని, వివిధ దొంతరల చైతన్యం పదార్థం పై ఆధారపడివుంటుందని భౌతికవాదం చెబుతుంది. పదార్థంతో నిమిత్తం లేని ఆత్మ ప్రాథమికం అని, భావం నుండే పదార్థం వచ్చిందని భావవాదం చెబుతుంది. సమాజంతో గాని, ప్రకృతితో గాని నిమిత్తం లేకుండా చైతన్యం, ఆలోచన ఉంటాయని భావవాదం అంటుంది.

పదార్థాన్ని, అంటే దాని వస్తుగతను (ఆబ్జెక్టివిటీ) తెలుసుకోగలమా లేదా అన్నది భౌతికవాదాన్ని, భావవాదాన్ని వేరు చేసే మరో కీలక ప్రశ్న. ఒక సరైన వైఖరితో సరైన విధానం అనుసరిస్తే పదార్థాన్ని తెలుసుకోవచ్చు అన్నది భౌతికవాదం అభిప్రాయం. మానవాతీతమైన సంపూర్ణ భావన (పరమాత్మ) సృష్టించిన ఈ పదార్థం యావత్తూ మనకి అంతుపట్టని విషయం గనుక పదార్థం గురించి తెలుసుకోలేము అని భావవాదం అంటుంది.

## భావవాదం

భావవాదం రకరకాల మతాల భావనలు తలెత్తడానికి మూలాధారంగా ఉంటుంది అన్న వాస్తవాన్ని ప్రస్తావించకపోతే భావవాదానికి సంబంధించిన చర్చ అసంపూర్ణంగా మిగిలిపోతుంది. అనేక మత విశ్వాసాలు, మూఢనమ్మకాలు భావవాదపు రూపాలే. అదే సమయంలో మత భావనలు భావవాదాన్ని మరింతగా పోషించడానికి దోహదపడ్డాయి. ద్వంద్వ స్వభావం (డ్యూయలిజం) గురించి కూడా ఈ సందర్భంగానే చెప్పుకోవాలి. ఈ వాదం భావవాదానికి, భౌతికవాదానికి మధ్య రాజీ కుదర్చడానికి ప్రయత్నిస్తుంది. ద్వంద్వ స్వభావం ఇటు భౌతిక ప్రాపంచవాస్తవికతనూ అంగీకరిస్తుంది. అటు ఆధ్యాత్మిక ప్రపంచం ఉనికినీ అంగీకరిస్తుంది. ఈ రెండు ప్రపంచాలనూ సమానంగా చూడడం ద్వారా, ఇవి రెండూ, ఒకదానితో మరొకదానికి నిమిత్తం లేకుండానే ఉనికిలో ఉన్నట్టు పరిగణిస్తుంది. భావవాద తాత్విక సిద్ధాంతపు మరో ఉదాహరణగా నయా–పాజిటివిజంను పేర్కొనవచ్చు. సైద్ధాంతిక ఆలోచన పెరుగుతున్నకొద్దీ, అత్యంత ప్రాథమికమైన అమూర్త భావనలు (నిర్దిష్ట రూపం నుంచి పూర్తిగా వేరుపడిన భావనలు– అబ్‌స్ట్రాక్ట్) భావవాదం తలెత్తడానికి ప్రాతిపదికలౌతాయి. మానవ విజ్ఞానం అభివృద్ధి చెందే క్రమంలో అనివార్యంగా ఎదురయ్యే ఇబ్బందులను భావవాదం తన "అఖండ భావం" తో ముడిపెట్టి తద్వారా ఆ ఇబ్బందులను పరిష్కరించడానికి జరగవలసిన శాస్త్ర పరిశోధనల కృషిని బలహీనపరుస్తుంది. వివిధ

రకాల భావవాదాలన్నింటినీ వస్తుగత భావవాదం, స్వీయాత్మక భావవాదం అనే రెండు తరగతులుగా విభజించవచ్చు.

వస్తుగత భావవాదం (ఆబ్జెక్టివ్ ఐడియలిజం) ఆత్మ ప్రాథమికం అని, పదార్థం దానినుంచి ఉత్పన్నమైనదని పరిగణిస్తుంది. ఈ ప్రపంచం అస్థిత్వానికి మూల కారణం లోకాతీతమైన అఖండ చైతన్యం అని, అదే విశ్వ హేతువు అని, మానవుల వ్యక్తిగతమైన మానవ చైతన్యం కాదని అంటుంది. ఉనికిలో ఉన్న ప్రతీదాని వెనుకా ఈ విశ్వాత్మ అనేది ఉందని, అది ఒక అద్భుతమైన, నాశనం లేని శక్తి అని, దానిని తెలుసుకోవడం అసాధ్యం అని అంటుంది. ఈ భౌతిక ప్రపంచం యావత్తూ దాని సృష్టి అని అంటుంది. ఈ సర్వశక్తిసంపన్నమైన పరమాత్మ సృష్టించిన భౌతిక ప్రపంచంలో అంతర్భాగంగానే మానవులు, సమాజం ఉన్నాయని చెప్తుంది. ఈ ప్రపంచంలో ఉనికిలో ఉన్న ప్రతీదీ 'మాయ' అని, అది అతీత శక్తి ప్రభావానికి లోబడివుంటుందని చెప్తుంది. అందుచేత పరమాత్మను తెలుసుకోవాలని ప్రయత్నించడం వృధా అని నిర్ధారిస్తుంది. ప్లేటో, అక్వినాస్, హెగెల్, శంకరుడు వస్తుగత భావవాదులుగా పేర్కొనవచ్చు.

మన ఆలోచనకు, చైతన్యానికి అతీతంగా భౌతిక వాస్తవికత అనేది ఏదీ ఉండజాలదని స్వీయాత్మక భావవాదం అంటుంది. మానవ చైతన్యానికి వెలుపల వాస్తవ ప్రపంచం అనేది ఉండదు అని అంటుంది.

మనకి గోచరించేవన్నీ మన చైతన్యంలో రూపుదిద్దుకున్న భావాల వ్యక్తీకరణలే. మనచుట్టూ ఉన్న పదార్థం నుండి గ్రహించే జ్ఞానం అంతా అవాస్తవిక మైనదే. ఎందుకంటే మనకి గోచరించేదేదీ వాస్తవంలో ఉనికిలో లేదు. ఆలోచన, లేదా చైతన్యం అనేది లేకుండా ఏ పదార్థమూ ఉనికిలో ఉండదు. నాకు ఎరుపు, ఆకుపచ్చ, పసుపుపచ్చ- ఇలా వివిధ రంగులు కనిపిస్తున్నాయంటే నేను ఆ విధంగా రంగుల్లో చూడాలని అనుకున్నందువల్లనే. చెట్లు, భవనాలు - ఇవన్నీ నేను చూస్తున్నానంటే అలా చూడాలనే కోరిక నా మనస్సులో ఉత్పన్నమైనందువల్లనే. అందుచేత వాస్తవానికి భౌతిక ప్రపంచం అనేది ఏదీ ఉనికిలో లేదు. వ్యక్తి యొక్క భావనలు, ఆ వ్యక్తి గ్రహించే విషయాలు తప్ప వాస్తవంగా ఉనికిలో ఏదీ ఉండదు. ఇదీ స్వీయాత్మక భావవాదం. బిషప్ బార్కెలే, హ్యూమ్, మాక్, సార్త్రే స్వీయాత్మక భావవాదాన్ని ప్రతిపాదించినవారు.

## భౌతికవాదం

పదార్థం అనంతంగా ఉనికిలో ఉంటుందని, అదే ప్రాథమికం అన్నది భౌతికవాదపు సారాంశం. పదార్థం అభివృద్ధి చెందే (పరిణామం చెందే) క్రమంలో చైతన్యం అనేది రూపొందింది. మెదడు అనే ఒక ప్రత్యేకరూపంలో ఉండే పదార్థం

యొక్క లక్షణం చైతన్యం. మానవ సమాజ పరిణామంతో సమాంతరంగా, నూతన యుగ ఆవిర్భావాలకు దారి తీసిన శాస్త్రీయ ఆవిష్కరణలతో బాటు, భౌతికవాద తత్వశాస్త్రం పెంపొందింది. అది ఒక కచ్చితమైన ప్రాపంచిక దృక్పథాన్ని అందిస్తుంది. మానవ జీవితంలో రోజువారీగా ఎదురయ్యే కష్టాలను అధిగమించడానికి కచ్చితమైన చర్యలను చూపగలిగే ప్రాపంచిక దృక్పథం భౌతికవాదం. ప్రపంచంలో ఉన్న ప్రతీ దృగ్గోచర విషయాన్ని, పాదార్థిక విషయాలను ప్రయోగాల ద్వారా, అనుభవాల ద్వారా, ఆచరణ ద్వారా వివరించడం సాధ్యమేనని భౌతికవాదులు గట్టిగా విశ్వసిస్తారు. మానవుల సామాజిక అస్తిత్వమే వారి చైతన్యాన్ని నియంత్రిస్తుందని చెప్పే భౌతికవాద సిద్ధాంతం పదార్థానికి, చైతన్యానికి నడుమ ఉన్న సంబంధానికి ప్రతినిధి.

భౌతికవాదం దైవం ఉనికిని గాని ప్రకృతికి అతీతంగా మరే ఇతర శక్తుల ఉనికిని గాని తిరస్కరిస్తుంది. అనంతకాలం నుండీ పదార్థం ఉనికిలోనే ఉంటున్నందువలన దానిని ఎవరు సృష్టించారనే ప్రశ్నగాని, దానిని సృష్టించడం అన్న చర్చ గాని ఉత్పన్నం కావు. అనంతమైన విశ్వానికి ఒక దిశ గాని, ఒక లక్ష్యం గాని ఉంటాయని భౌతికవాదం అంగీకరించదు. చైతన్యంతో కూడిన పదార్థం ప్రత్యేకించి మానవజాతి – తన కార్యకలాపాలను చైతన్యయుతంగా నిర్దేశిస్తుంది. మానవుల ఆలోచనలు, భావోద్వేగాలు, ఆదర్శాలు, కోర్కెలు అన్నీ జీవరూపంలో ఉన్న క్రమంలోనే రూపొందుతాయని, తక్కిన రూపాల్లో ఉండే జీవ పదార్థంతో పెంపొందే పరస్పర సంబంధాల మీద ఆధారపడి ఇవి ఉంటాయని భౌతికవాదం వివరిస్తుంది. అదే సమయంలో, ఆ ఆలోచనలు, భావోద్వేగాలు, ఆదర్శాలు, కోర్కెలు ఏ కాలంలోనైనా, ఆనాటి నిర్దిష్ట ఆర్థిక, సామాజిక పరిణామాలకు అనుగుణంగా పరిణామం చెందుతాయని చెప్తుంది. శాస్త్రవిజ్ఞానాన్ని ఉపయోగించి మన గురించి, ఈ విశ్వం గురించి తెలుసుకోవడం సాధ్యమేనని భౌతికవాదం చెప్తుంది.

## శాస్త్ర విజ్ఞానం

ఆవిర్భవించినప్పటినుంచీ మానవజాతి తన ఉనికి కోసం, మనుగడ కోసం నిరంతరాయంగా పోరాడుతూనే వుంది. మానవ శ్రమ ద్వారా – అంటే ఉత్పాదక కార్యకలాపాలలో మానవ శ్రమను వినియోగించడం ద్వారా ప్రకృతిని మార్చవచ్చు. అట్టి ఉత్పాదక కార్యకలాపాలు జరిగే క్రమంలో భాగంగానే శాస్త్ర విజ్ఞానం రూపొందింది. ప్రకృతిలో జరిగే వివిధ ప్రక్రియలను, ప్రకృతికి వర్తించే నియమాలను తెలుసుకోవడమే శాస్త్రవిజ్ఞానం. పదార్థాన్ని, దానికి సంబంధించిన వివిధ ప్రక్రియల్ని శాస్త్ర విజ్ఞాన పద్ధతుల ద్వారానే అధ్యయనం చేయడం సాధ్యపడుతున్నది. ఇది మానవుల

కార్యాచరణతో ముడిపడివుంది. అందుచేత జ్ఞానాన్ని పొందడానికి శాస్త్రవిజ్ఞాన పద్ధతులను అనుసరించడమే సరైన మార్గం.

పదార్థపు వివిధ భాగాల మధ్య, మనకి అవి గోచరించే వివిధ రూపాల మధ్య ఉండే నిత్య, నూతన అంతస్సంబంధాలను శాస్త్ర విజ్ఞానం నిరంతరాయంగా కనుగొంటూనే వుంది. శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందుతున్నకొద్దీ వివిధ రూపాల పదార్థంలో స్వతఃసిద్ధంగా ఉన్న వైరుధ్యాల కొత్త రూపాలను కూడా శాస్త్ర విజ్ఞానం ఆవిష్కరిస్తూనే వుంది. అభివృద్ధి క్రమంలో కొత్తగా తలెత్తే సవాళ్ళకు, మన జ్ఞానానికి గల పరిమితులకు మధ్య ఉన్న వైరుధ్యం పరిష్కారం అయ్యే క్రమంలోనే శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందుతోంది.

శాస్త్రవిజ్ఞానంలో సాధించిన అనేక విజయాలను వక్రీకరించి ప్రచారం చేయడం ద్వారా భౌతికవాదాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నాలు జరిగాయి. 20వ శతాబ్దపు మొదటి రెండు దశాబ్దాలలో, ఈ మాదిరి ప్రయత్నాలు చాలా జరిగాయి. ఆ సమయంలో భౌతికవాదాన్ని సమర్థించడానికి లెనిన్ చాలా గట్టి కృషి చేశారు.

**(1) సద్యోజనిత భౌతికవాదం**

ఇది ప్రాచీన కాలంలో దైనందిన జీవితంలో ఎదురయ్యే అనుభవాల ప్రాతిపదికన రూపొందిన సాధారణ సూత్రాల నుండి మొదలై రూపు దిద్దుకుంది. భారతదేశంలోని చార్వాక సిద్ధాంతాన్ని రూపొందించిన తత్వవేత్తలు ఈ కోవకు చెందుతారు. ప్రాచీన గ్రీకు భౌతికవాదులైన హిరాక్లిటస్, డెమాక్రిటస్ కూడా సద్యోజనిత భౌతికవాదులే. ఈ విశ్వం పదార్థమయం అని వారు బలంగా చెప్పారు. ఐతే, ఈ పదార్థం వివిధ దశల్లో అభివృద్ధి చెందే క్రమాన్ని వారు అవగతం చేసుకోలేకపోయారు.

**(2) (అధిభౌతికవాద) మెటఫిజికల్ భౌతికవాదం**

ఈ తాత్విక సిద్ధాంతం 17, 18 శతాబ్దాలలో ఆవిర్భవించింది. దీనిని ప్రతిపాదించిన వారిలో ఫ్రాన్సిస్ బేకన్, జాన్ లాక్ వంటి ఇంగ్లీషు తత్వవేత్తలు, స్పినోజా అనే డచ్ తత్వవేత్త, జూలియన్ మెట్రీ, డైడెరాట్, హెల్వేటియస్ అనే ఫ్రెంచి తత్వ వేత్తలు, ఫ్యూయర్‌బా అనే జర్మన్ తత్వవేత్త వంటి ప్రముఖులు ఉన్నారు. మెటఫిజికల్ భౌతికవాదం ఏదైనా పదార్థపు కొత్త రూపాన్ని కాని, ఘటనను కాని తక్కినవాటినుంచి విడదీసి పరిశీలిస్తుంది. పరిమాణాత్మక మార్పుల్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటుంది. చలనం ద్వారా పదార్థం, లేదా ఒక ప్రక్రియ కొత్త రూపానికి పరిణామం చెందుతుంది అన్న వాదనను ఇది అంగీకరించదు. ప్రస్తుత కాలంలో కూడా ఈ మెటఫిజికల్ దృక్పథం పలు రూపాల్లో ఉనికిలో కొనసాగుతోందని ఇక్కడ చెప్పడం అవసరం.

### (3) యాంత్రిక భౌతికవాదం

ఈ భౌతిక ప్రపంచం యాంత్రికమైనది. ఈ విశ్వం యావత్తూ ఒక యంత్రం వంటిది. ఈ యంత్రం నడవాలంటే బైటనుంచి దానికి శక్తిని లేదా ఇంధనాన్ని అందించాలి. ఒక ప్రధానమైన కదిలించే శక్తి అంటూ లేకపోతే చలనం అనేది ఉత్పన్నం కాదు. అటువంటి మార్పు బాహ్య శక్తులవల్ల మాత్రమే సాధ్యం. -- ఇదీ యాంత్రిక భౌతికవాదం సారాంశం. ఇది పరిణామం అనే భావననే మొత్తంగా తిరస్కరిస్తుంది. ఒక పదార్థంలోపల గాని, ఘటన లోపల గాని అంతర్గతంగా సంభవించే మార్పును అది పరిగణనలోకి తీసుకోదు. సర్ ఐజాక్ న్యూటన్ కనుగొన్న చలన సూత్రాలు ఈ తాత్విక సిద్ధాంతానికి పునాది. చాలా విషయాల్లో మెటఫిజికల్ భౌతికవాదానికి, యాంత్రిక భౌతికవాదానికి దగ్గర పోలికలున్నాయి.

### (4) ఆలోచనాత్మక భౌతికవాదం, మార్క్స్ విమర్శ: శాస్త్రీయ భౌతికవాదం

మానవులు తమ తమ పర్యావరణం నుండి సృష్టించబడినవారే అని 18వ శతాబ్దపు యాంత్రిక, ఆలోచనాత్మక భౌతికవాదులు బలంగా వాదించారు. భావవాదులు సరిగ్గా దీనికి వ్యతిరేక దిశలో వాదిస్తారు. పర్యావరణం మానవుల సృష్టి అని వారంటారు. ఈ రెండు సిద్ధాంతాల పరిమితులనూ గతితార్కిక భౌతికవాదం సరిగ్గా గుర్తించింది. మానవులకు, పర్యావరణానికి మధ్య, అదే విధంగా మానవులలో ఒకరికి మరొకరికి మధ్య నిరంతరం పరస్పర ప్రతిచర్య (ఇంటరాక్షన్) కొనసాగుతూ వుంటుంది. మరో విధంగా చెప్పాలంటే, ప్రకృతికి, సమాజానికి మధ్య నిరంతరం పరస్పర ప్రతిచర్య కొనసాగుతూ వుంటుంది. అటువంటి పరస్పర ప్రతిచర్యల సారాంశమే జ్ఞానంగా రూపు దిద్దుకుంటుంది. తమ జ్ఞానం ద్వారా, ఆలోచనలద్వారా, చర్యల ద్వారా పర్యావరణాన్ని మార్చగలరు అన్న విషయాన్ని యాంత్రిక భౌతికవాదులు అంగీకరించరు. మరోవైపు భావవాదులు వాస్తవ జీవితానుభవాలనుండి ఆలోచనలు, పరిజ్ఞానం రూపొందుతాయని అంగీకరించరు. అన్ని చర్యలకు, మార్పులకు మూలం పరమాత్మేనని వారంటారు.

### (5) గతితార్కిక భౌతికవాదం

గతితార్కిక భౌతికవాదం మార్క్సిస్టు తత్వశాస్త్రం. ఇది 19వ శతాబ్దంలో మొదలైంది. 18, 19 శతాబ్దాలలో ప్రకృతి శాస్త్రాలలో అద్భుతమైన ఆవిష్కరణలు జరిగాయి. " .....అప్పటికే మానవజాతిలోని గొప్ప మేధావులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలను అందించడంలోనే మార్క్స్ మేధోశక్తి కానవస్తుంది. అంతవరకూ తత్వ శాస్త్రంలో, రాజకీయ అర్థశాస్త్రంలో, సోషలిజంలో అత్యంత ప్రతిభావంతంగా సాగిస్తూవచ్చిన బోధనలను నేరుగా, వెనువెంటనే ముందుకు కొనసాగించిన సిద్ధాంతమే

మార్క్సిజం.” (మార్క్సిజం– మూడు ఆధారాలు, మూడు అంతర్భాగాలు – లెనిన్ రచన నుండి) భౌతికవాద దృక్పథాన్ని, గతితర్కాన్ని మేళవించినదే గతితార్కిక భౌతికవాదం. పదార్థం ప్రాథమికం అని పరిగణిస్తుంది గనుకు అది భౌతికవాదం. ఐతే అది అంతకు ముందు వచ్చిన యాంత్రిక, మెటఫిజికల్ భౌతికవాదాలకంటె విభిన్నమైనది. భౌతిక వాస్తవికతను గతితార్కిక పద్ధతిలో అది పరిశీలిస్తుంది, అధ్యయనం చేస్తుంది గనుకనే అది విభిన్నమైనది అయింది. పదార్థం నిరంతరం చలనంలోనే ఉంటుందని, చలనం లేని పదార్థం అంటూ ఉండదని గతితర్కం చెప్తుంది.

పరిణామానికి, అభివృద్ధికి సంబంధించిన అత్యంత సమగ్రమైన, లోతైన సిద్ధాంతంగా గతితార్కిక భౌతికవాదం ముందుకొచ్చింది. “ఇది పరిణామానికి, అభివృద్ధికి సంబంధించిన అత్యంత సమగ్రమైన, సారభరితమైన, లోతైన సిద్ధాంతం” అని లెనిన్ చెప్పారు.“ మొత్తం విషయాన్ని ముక్కముక్కలుగా విడగొట్టి పరిశీలించి ఆ మొత్తం విషయంలో ఉన్న పరస్పర విరుద్ధ లక్షణాలను కనుగనడమే గతితర్కపు సారాంశం” అని ఆయన చెప్పారు.“ చలనశీలమైన విశ్వానికి, మానవ చైతన్యానికి సంబంధించిన సాధారణ సూత్రాల పరిజ్ఞానమే గతితర్కం” అని ఎంగెల్స్ అన్నారు. “ప్రకృతికి, మానవసమాజానికి సంబంధించిన చరిత్ర నుండి గతితార్కిక సూత్రాలు సర్వ సాధారణ నియమాలుగా రూపొందాయి. “చరిత్ర అభివృద్ధికి సంబంధించి, మానవుల ఆలోచనల అభివృద్ధికి సంబంధించిన సర్వ సాధారణ నియమాలు ఇవి.” అని ఎంగెల్స్ వివరించారు. పదార్థంలోనే గతితర్కం ఇమిడివుంది. చలనం లేని పదార్థం ఊహాతీతమైనది. ఆ పదార్థంలో ఉండే పరస్పర విరుద్ధ అంశాల మధ్య వైరుధ్యం కారణంగా పదార్థంలో అంతర్గతంగా చలనం అనేది సంభవిస్తుంది.

మానవసమాజాన్ని, దాని పరిణామక్రమాన్ని అధ్యయనం చేయడంలో గతితార్కిక భౌతికవాదాన్ని వర్తింపజేస్తే అది చారిత్రిక భౌతికవాదం ఔతుంది. గతితార్కిక, చారిత్రిక భౌతికవాదాలు రెండూ కలిసి మార్క్సిస్టు తత్వశాస్త్రం అయింది.

**పదార్థం అంటే ఏమిటి?**

భౌతికంగా ఉనికిలో ఉండేది ఏదైనా పదార్థమే అని గతితార్కిక భౌతికవాదం చెప్తుంది. మనం గ్రహించగలుగుతామా లేదా అన్న దానితో నిమిత్తం లేకుండా ఉనికిలో ఉన్నది, మన చైతన్యంలో ప్రతిఫలించగలిగేది (మనం గ్రహించగలిగేది) పదార్థం. మనచుట్టూ ఉన్నదంతా పదార్థమే. తగిన పద్ధతిలో, తగిన పరికరాల సహాయంతో పదార్థం గురించిన చైతన్యాన్ని మనం పొందగలుగుతాం. ఆచరణలో మానవులు తమ జ్ఞానేంద్రియాలను ఉపయోగించి చేసే ప్రతీ పనీ భౌతిక వాస్తవికతలో భాగమే ఔతుంది. అన్ని రకాల కార్యాచరణ, రాజకీయ కార్యాచరణతో సహా, భౌతిక

వాస్తవికతలో భాగమే. అంటే పదార్థానికి సంబంధించినదే. మనకు అనిపించేది, మన జ్ఞానేంద్రియాలద్వారా గ్రహించేది మాత్రమే పదార్థం అనుకుంటే పొరపాటు. మన పరిధిని మించి, మనకు అందుబాటులో లేని పదార్థం ఎంతో ఉంది. అదంతా పదార్థమే. అంటే మానవ విజ్ఞానానికి లోబడి ఉండేదే పదార్థం అనుకోరాదు. మన విజ్ఞానంతో నిమిత్తం లేకుండా ఎంతో పదార్థం ఉంది. కంటికి కనిపించేదే పదార్థం అనుకోరాదు. పదార్థం అనేది ఒక తాత్విక భావన.

## చలనం

ప్రతీ సంఘటన, ప్రతీ వస్తువు నిరంతరాయంగా మారుతూ పరిణామం చెందుతూవుంటాయి. పరిణామం అంటే చలనంతో బాటు అభివృద్ధి. సాధారణంగా జరిగే మార్పు ప్రతీదీ చలనమే. పాదార్థిక వస్తువుల నడుమ జరిగే పరస్పర ప్రతిచర్య ఏ కోవకు చెందినదైనప్పటికీ, అది చలనం గానే పరిగణించాలి. ప్రకృతిలోను, సమాజంలోను జరిగే ప్రతీ ప్రక్రియను చలనం సూచిస్తుంది. పదార్థం చలనంతో కూడిన రూపంలో మాత్రమే వ్యక్తం ఔతుంది. చలనం పదార్థపు స్వభావం. పదార్థాన్ని, పాదార్థిక ప్రక్రియలను అవి నిరంతర చలనంలో ఉంటున్న క్రమంలోనే పరిశీలించాలి. ఆ నిరంతర చలనం లోనే వాటి పరిణామాన్ని అంచనా వేయాలి.

చలనం లేకుండా పదార్థం అనేది ఉండదు అని మొట్టమొదటిసారిగా చెప్పినది గతితార్కిక భౌతికవాదమే. చలన రహితంగా పదార్థం అనేది ఉండదు. వాస్తవంగా మనకి నిశ్చలంగా ఉన్నట్టు కనిపించే పదార్థం కూడా చలనంలోనే ఉంటుంది. మనం కదలకుండా కూర్చుని ఉన్నప్పుడు, లేదా విశ్రాంతి స్థితిలో ఉన్నప్పుడు కనిపించే నిశ్చల స్థితిని సాపేక్షంగా మాత్రమే పరిగణించాలి. ఎందుకంటే మనం ఉన్న ఈ భూమి నిరంతరాయంగా వివిధ రకాల చలనాలలో ఉంది. తన చుట్టూ తాను తిరుగుతుంది భూమి. దానితోబాటు సూర్యుని చుట్టూ తిరుగుతుంది. సౌర కుటుంబంలో ఉన్న గ్రహాలన్నీ, భూమితో సహా, పాలపుంత అనే గెలాక్సీ చుట్టూ గణనీయమైన వేగంతో పరిభ్రమిస్తూంటాయి. కనుక, మనతో సహా, ఈ భూమిపైన ఉన్న ప్రతీదీ నిరంతరం చలనంలోనే ఉంటుంది. మనం నిద్రిస్తున్నా, కూచుని కలదలకుండా ఉన్నా మన వంట్లో రక్తం నిరంతరం ప్రవహిస్తూనే వుంటుంది. మన శరీరంలో జీవ ప్రక్రియ కొనసాగుతూనే వుంటుంది. జీవించివున్న మనిషి శరీరంలో పాత జీవకణాలు చచ్చిపోతూ, కొత్త జీవకణాలు పుడుతూ వుంటాయి. పగలు, రాత్రి అనేవి కూడా నిరంతర చలనం యొక్క రూపాలే. మానవ సమాజం కూడా ఎప్పుడూ నిశ్చలంగా ఉండదు. నిరంతరం చలనంలోనే ఉంటుంది. వడి (వేగం పెరుగుదల లేదా తరుగుదల ను సూచించేది– వెలాసిటీ) కూడా పదార్థపు లక్షణమే. మన భూమండల ఉపరితలం

కూడా చలనంలోనే ఉంది. ఆ భూమి పొరల కదలికల పర్యవసానంగా భూకంపాలు సంభవిస్తాయి. ప్రస్తుతం మన ఖండాల, మహాసముద్రాల సరిహద్దులు ఎప్పుడూ అదేవిధంగా లేవు. ప్రపంచ పటం కూడా మారిపోతూ వుంటుంది. ఐతే అది చాలా నెమ్మదిగా సాగుతున్నందువలన మనం దానిని గ్రహించలేం. శాస్త్ర విజ్ఞానంలో నిశ్చల శక్తి (స్టాటిక్ ఎనర్జీ) అన్నది ఒకటుంది. శక్తి ఆ విధంగా నిశ్చలస్థితిలో ఉండడం కూడా చలనం యొక్క ఒక రూపమే.

## స్థలము-కాలము - చలనశీల పదార్థపు ధర్మం

స్థలము, కాలము: ఇవి పదార్థం ఉనికిలో దానికి ఉండే రూపాలు. అవి వస్తుగతమైవి. పదార్థం నుండి వీటిని వేరు చేసి చూడలేం. ఎందుకంటే అవి రెండూ విశ్వజనీనమైనవి. ఒకే సమయంలో వివిధ రూపాల పదార్థాలు ఎక్కడెక్కడ ఉన్నదీ స్థలం తెలియజేస్తుంది. ఒకదానివెంట ఒకటిగా జరిగే ప్రక్రియల వరుస క్రమాన్ని వెల్లడి చేసేది కాలం. కాలం వెనక్కి పోదు. ప్రతీ పాదార్థిక ప్రక్రియా ఒకే దిశగా, అంటే, గతం నుండి భవిష్యత్తు వైపుగా పయనిస్తూ వుంటుంది. కాలం, స్థలం యొక్క సారాంశమే చలనం. అందుచేత పదార్థం, చలనం, కాలం, స్థలం అన్నీ విడదీయలేనివి. కాలం అనంతంగా ఉన్నది అని, మధ్యలో చలనంతో కూడిన పదార్థం వచ్చి చేరిందని ఒక భావన ఉంది. అది పూర్తిగా తప్పు. దేశం, సముద్రం, ఖండం, కొండ వగైరాలన్నీ చలనంతో కూడిన పదార్థ రూపాలే. గ్రహాలు, నక్షత్రాలు, గెలాక్సీలు వంటి పెద్ద పెద్ద రూపాలు కూడా చలనంతో కూడిన పదార్థమే. చలనంలో ఉండే పదార్థం చుట్టూ స్థలం ఏర్పడుతుంది. చలనంలో ఉండే పదార్థం ఉనికిలో కొనసాగే వ్యవధిని వ్యక్తం చేసేది కాలం. చలనంతో కూడిన పదార్థం అనేది లేకుండా కాలం అనేది విడిగా ఉండదు. మనం కాలాన్ని సంవత్సరాలలో, నెలల్లో, రోజుల్లో, గంటల్లో, నిమిషాల్లో, సెకన్లలో పరిశీలిస్తాం. ఉదాహరణకు ఒక ఏడాదిని తీసుకుందాం. సూర్యుడి చుట్టూ భూమి పూర్తిగా ఒకసారి చుట్టి రావడానికి పట్టే కాలం ఇది. అదే విధంగా ఒక రోజును తీసుకుందాం. భూమి తన చుట్టూ తాను ఒకసారి పూర్తిగా తిరగడానికి పట్టే కాలం ఇది. అందులో 24వ వంతు ఒక గంట. ఆ గంటలో 60వ వంతు ఒక నిమిషం. అంటే కాలానికి సంబంధించిన మన అవగాహన భూమి తన చుట్టూ తాను పరిభ్రమించడం మీద, సూర్యుడిచుట్టూ తిరగడం మీద ఆధారపడి ఏర్పడింది. ప్రాచీన కాలంలో భూమిపైన కనిపించే నీడల పొడవులోని మార్పును బట్టి కాలాన్ని కొలిచేవారు. చలనంలోఉన్న పదార్థం లేకుండా స్థలం అనేది ఎలా ఉండదో, కాలం అనేది కూడా చలనంతో కూడిన పదార్థం లేకుండా ఉండదు. కాలం, స్థలం అనేవి చలనంతో కూడిన పదార్థం యొక్క ధర్మాలు.

గత శతాబ్దంలో ఐన్‌స్టీన్ ఆవిష్కరించిన సాపేక్షతా సిద్ధాంతం ఈ సంబంధం గురించి మరింత స్పష్టతనిచ్చింది. అంతవరకూ ఉన్న సిద్ధాంతానికి భిన్నంగా విప్లవాత్మకంగా సాపేక్ష సిద్ధాంతం పదార్థం, శక్తి ఒకదాని నుండి ఇంకొకదానిగా మారుతాయని రుజువు చేసింది. చలనం అనేది కాలంతో విడదీయలేని అంశంగా రుజువు చేసింది. ఇంకోవిధంగా చెప్పాలంటే, స్థల, కాలాలు రెండూ చలన సహితమైన పదార్థపు లక్షణాలని, వాటిని విడదీయలేమని రుజువు చేసింది. అదే విధంగా వడి అనేది పదార్థపు లక్షణమని, దానిని విడిగా చూడలేమని ఆ సిద్ధాంతం రుజువు చేసింది. గురుత్వాకర్షణ శక్తి ప్రభావాన్ని కలిగించగలిగిన భారీ పదార్థాలు (భూమి, గ్రహాలు వగైరా) స్థల, కాలాల్ని వక్రీకరించగలవు అని సాపేక్ష సిద్ధాంతం రుజువు చేసింది. ఇంకోలా చెప్పాలంటే, స్థలం, కాలం భూమి చుట్టూ అతుక్కుపోవడమేగాక, భూమి భ్రమణం కారణంగా మెలిదిరిగిపోతాయి. పూర్తిగా సాగదీసి పరిచిన టార్పాలిన్ మధ్యలో ఒక పెద్దసైజు రాతిగుండును ఉంచామనుకోండి. ఆ చోట ఒక పెద్ద గొయ్యి మాదిరిగా ఏర్పడుతుంది. అప్పుడు ఒక చిన్న గోళీను తీసుకుని ఆ టార్పాటిన్ అంచు వెంబడే తిప్పుతూ పోయామనుకోండి. అప్పుడది క్రమంగా మధ్యలో ఉన్న రాతిగుండు వైపు తిరుగుతూ వస్తుంది. అంతరిక్షంలో పెద్ద పెద్ద గ్రహాలు చిన్న చిన్న శకలాలను ఆ విధంగానే తమవైపు లాక్కుంటాయి. ఈ సాపేక్ష సిద్ధాంతం ఆవిష్కరించబడిన తర్వాత విశ్వం ఆవిర్భావానికి సంబంధించిన సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయి.

## జీవం

భౌతిక, రసాయన రూపాలలోని చలనం కన్నా గుణాత్మకంగా ఉన్నతస్థాయి చలన రూపం జీవ పదార్థం. దీనికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. విడి విడిగా, జీవ రూపాలలో ఇది మనకి కనిపిస్తుంది. ఆయా జీవ పదార్థాల కలయికలలో కూడా కనిపిస్తుంది. మానవులకు జీవం ప్రకృతికి అతీతమైన ఏదో శక్తి ద్వారా లభించింది అని చాలా కాలం వరకూ ప్రజలు భావించారు. ఐతే నిర్జీవ పదార్థం నుండి పరిణామ క్రమంలో జీవం అనేది పుట్టింది అని శాస్త్రవిజ్ఞానం మనకి తెలియజెప్పింది. మన భూమ్మీద జీవం సుమారు 370 కోట్ల సంవత్సరాల క్రితం పుట్టింది. ప్రాథమికదశలో ఉన్న భూప్రపంచం మీద నెలకొన్న పరిస్థితులలో ఎమైనో ఆసిడ్స్, ఇతర సకర్బన (ఆర్గానిక్) పదార్థాల మధ్య వివిధ రసాయన చర్యలద్వారా జరిగిన సంశ్లేషణ (సింథసిస్) నుంచి జీవపదార్థం పుట్టింది. ఆనాటినుంచి ఉన్న జీవ రూపాలు పరిణామక్రమంలో అత్యంత వైవిధ్యభరిత రూపాల్లో మన ముందు కనిపిస్తున్నాయి. ఈ పరిణామక్రమంలోనే మానవజాతి కూడా పుట్టింది. 25 లక్షల సంవత్సరాల క్రితమే ఆస్ట్రలోపితికస్ మానవులు పనిముట్లు చేయగలిగారన్న విషయం నిరూపణ అయింది. దాదాపు 60 లక్షల

సంవత్సరాల క్రితం నిటారుగా నిలవగలిగిన నరవానరాలు ఉండేవని, ఆధునిక మానవులు వాటినుండే ఆవిర్భవించారని చెప్పడానికి ఆధారాలు ఉన్నాయి., మరోవిధంగా చెప్పాలంటే, కొన్ని కోట్ల సంవత్సరాల పరిణామ క్రమంలో అత్యంత ప్రాథమికమైన జీవ పదార్థం ఏర్పడింది. ఈ క్రమంలోనే మానవులు ఆవిర్భవించారు. ఆధునిక మానవుడు ఆవిర్భవించి 2,50,000 సంవత్సరాలు అయివుంటుందని సుమారుగా చెప్పవచ్చు. వృక్షజాతులు సుమారు 50 కోట్ల సంవత్సరాల క్రితం ఆవిర్భవించాయి. 36 కోట్ల సంవత్సరాల క్రితం భూమిపైన, నీటిలోను జీవించగల ఉభయచర జీవులు పుట్టాయి. పక్షులు సుమారు 15 కోట్ల సంవత్సరాల క్రితం పుట్టాయి. స్థన్య జీవులైన జంతువులు 13 కోట్ల సంవత్సరాల క్రితం వచ్చాయి. క్లుప్తంగా చెప్పాలంటే, జీవం అనేది పదార్థపు చలనం వ్యక్తమయే ఒకానొక రూపం.

1953లో ఫ్రాన్సిస్ క్రిక్, జేమ్స్ వాట్సన్ అనే శాస్త్రజ్ఞులు డిఎన్ఎ (డి ఆక్సీ రిబో న్యూక్లియిక్ ఆసిడ్) నిర్మాణం చాంతాడులో రెండు వేర్వేరు తాళ్ళు ఏవిధంగా పెనవేసుకుని వుంటాయో ఆ మాదిరిగా ఉంటుందని కనుగొన్నారు. (డబుల్ హిలికల్ స్ట్రక్చర్) 20వ శతాబ్దానికెల్లా అత్యంత ప్రాధాన్యత గల పరిశోధనగా దీనిని పరిగణిస్తారు. ఈ ఆవిష్కరణ జరిగి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఆ శాస్త్రవేత్తలలో ఒకరైన వాట్సన్ ఇలా రాశారు: ''మానవజాతి ఆవిర్భావం నుండీ కొనసాగుతున్న వాదప్రతివాదాలకు మా పరిశోధన తెర దించింది. జీవం ఆవిర్భావం వెనుక ఏదైనా పరమాద్భుతం గాని, ప్రకృతికి అతీతమైన శక్తిగాని ఉందా? లేక మనకు సైన్స్ పాఠాలలో క్లాసులో బోధించే భౌతిక, రసాయన చర్యల అంతిమ ఫలితంగా జీవం ఏర్పడిందా? జీవకణం కేంద్రంలో ఏదైనా దైవశక్తి ఉందా? మేము కనుగొన్న డిఎన్ఎ రూపం దీనికి సమాధానం ఇచ్చింది.  జీవకణంలో దైవికమైనది ఏదీ లేదు. అత్యంత సహజమైన భౌతిక, రసాయన ప్రక్రియల క్రమంలోనే జీవం పుట్టింది.'' ఈ పరిశోధన జరిగిన 10 సంవత్సరాల తర్వాత 1963లో హరగోబింద్ ఖురానా, మార్షల్ నిరెన్‌బర్గ్ చేసిన పరిశోధనలు వాట్సన్, క్రిక్ ల నిర్ధారణలను మరింత బలోపేతం చేశాయి.

## చైతన్యం

పదార్థం యొక్క అత్యున్నమైన, అత్యంత సంఘటితమైన రూపమే మానవ మస్తిష్కం. (మెదడు) ఆలోచనలు, చైతన్యం అనేవి ఈ మెదడు యొక్క పనులు. ఆధునిక శాస్త్ర విజ్ఞానం పుణ్యమా అని ఈ మెదడు ఏవిధంగా పని చేస్తుందో మనం తెలుసుకోగలిగాం. అసంఖ్యాకమైన రసాయన, విద్యుత్, విద్యుదయస్కాంత ప్రతిచర్యల ద్వారా మెదడు పని చేస్తుంది. వీటన్నింటి నుంచి వచ్చినదే చైతన్యం. మెదడుకు

వెలుపల ఉన్న భౌతిక వాస్తవికతలు మెదడులో ప్రతిబింబిస్తాయి. బాహ్య వాస్తవికతలు, మెదడులో వాటి ప్రతిబింబాలు – వీటి మధ్య అంతఃసంబంధమే చైతన్యానికి పునాది. మెదడు లేకుండా విషయ జ్ఞానం గాని, భావం గాని, ఆలోచన గాని రూపొందజాలదు. ప్రకృతితో, సమాజంతో తలపడేందుకు కావలసిన సామర్థ్యం చైతన్యం ద్వారానే కలుగుతుంది. ప్రతీ మానవ కార్యాచరణకూ ఇది వర్తిస్తుంది.

ఆలోచనలు ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగివుంటాయని (మెదడుతో నిమిత్తం లేకుండా) భావవాదులు పరిగణిస్తారు. దీనినే వాళ్ళు ఆత్మ అని, దానికి దైవిక శక్తితో సంబంధం ఉందని అంటారు.

## జ్ఞానం, సత్యం

ఈ భూమ్మీద తమ మనుగడ కోసం, తమ రక్షణ కోసం మానవజాతి శతాబ్దాలపాటు పోరాడవలసివచ్చింది. ప్రకృతితో మానవులు తలపడడానికి మాధ్యమం శ్రమ. ఈ పోరాట క్రమంలో మానవుల నాడీమండల వ్యవస్థ అభివృద్ధి చెందింది. దానితోబాటు మెదడు కూడా అభివృద్ధి చెందింది. ఈ క్రమంలోనే మానవులు ఆలోచించగల శక్తిని సంతరించుకున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో శ్రమ తన పాత్ర పోషించింది. అంటే జ్ఞానాన్ని పెంపొందించుకోవడం సాధ్యపడింది. మానవ కార్యాచరణల క్రమంలో, ఆ కార్యాచరణల మీద ఆధారపడి జ్ఞానం పెంపొందింది. ప్రకృతి, మానవులు పరస్పరం తలపడే క్రమమే మానవుల కార్యాచరణను నిర్దేశిస్తుంది. తమ తమ చర్యల ద్వారా, మానవులు ప్రకృతిలో జోక్యం చేసుకుంటారు. ఆలోచనల క్రమంలో పెంపొందే జ్ఞానం ప్రకృతితో మరింత ధాటిగా. మరింత సక్రమమైన దృష్టితో తలపడడానికి దోహదం చేస్తుంది. ఆలోచనలు, భావోద్వేగాలు, జ్ఞానం –ఇవన్నీ బాహ్య ప్రపంచపు వాస్తవికతయొక్క ప్రతిబింబాలే. ఐతే జ్ఞానం సరైనదో కాదో నిర్ధారించడానికి ఆచరణలో దానిని పరిశీలించడం ఒక్కటే మార్గం.

“భౌతిక వాస్తవికతను, సత్యాన్ని మానవులు తమ ఆలోచనలోకి తెచ్చుకోగలరా అన్న ప్రశ్న సిద్ధాంత సమస్య కాదు. అది ఆచరణకు సంబంధించిన ప్రశ్న. వాస్తవికతను, దానిని గ్రహించగలిగే తన శక్తిని మానవుడు ఆచరణ ద్వారా నిరూపించాలి. ఆలోచన వాస్తవమైనదా కాదా అన్న చర్చ ఆచరణతో సంబంధం లేకుండా సాగితే అది శుష్క పాండిత్య ప్రకర్ష మాత్రమే ఔతుంది” అని మార్క్స్ ప్రకటించారు.

మానవ కార్యాచరణలో జ్ఞానానికి ప్రత్యక్ష పాత్ర ఉంది. ప్రకృతిలో పరిస్థితులను మార్చగలిగే విధంగా మానవులు చేపట్టే చర్యల వెనుక జ్ఞానం యొక్క పాత్ర ఉంది. ప్రకృతి భౌతికంగా ఉంది. మానవులు దానితో తలపడే చైతన్యయుత

పాత్ర పోషిస్తారు. జ్ఞానాన్ని ఇచ్చి పుచ్చుకోడానికి, పదిలపరచుకోడానికి సాధనం భాష. జ్ఞానాన్ని సమకూర్చుకోవడంలో సంగ్రహణ, (అబ్‌స్ట్రాక్షన్) నిర్దిష్టతను కల్పించడం అనేవి చాలా ముఖ్యం. భౌతిక వాస్తవికతలోని సాధారణ అంశాల పట్ల భావాన్ని రూపొందించడమే సంగ్రహణ. ఆ భావానికి భౌతిక ప్రపంచంలో స్పష్టమైన రూపం కల్పించడమే నిర్దిష్టత. ఇదంతా జ్ఞానం ఆర్జించే క్రమంలో భాగం. నిజానికి, వాస్తవికతకు అనుగుణంగా ఉండే లక్షణమే సత్యం. అవాస్తవికతకు ప్రతిరూపమే అసత్యం.

## సిద్ధాంతం–ఆచరణ–పరస్పర సంబంధం

ప్రకృతిని, సమాజాన్ని తెలుసుకోవడం, వాటిని మార్చడం అనే సాంఘిక–చారిత్రిక కార్యాచరణలో ప్రజలు ఉంటారు. ఆ కార్యాచరణ యొక్క భావాత్మక, భౌతిక పార్శ్వాలను సిద్ధాంతం, ఆచరణ తెలియజేస్తాయి. వాస్తవికతకు సంబంధించి మెదడులో ప్రతిబింబించేది ఆలోచనల రూపంలో తిరిగి వ్యక్తం ఔతుంది. అదే సిద్ధాంతం. ఇక ఆచరణ అనేది ప్రజల కార్యాచరణ. తమ మనుగడను కొనసాగించడానికి, సమాజాన్ని పరిణామక్రమంలో నడిపించడానికి మానవులు కార్యాచరణకు పూనుకుంటారు. ముఖ్యంగా మానవ జీవితానికి పునాది అయిన పాదార్థిక ఉత్పత్తి ప్రక్రియను చేపడతారు. ఆ క్రమంలో వివిధ వర్గాల కార్యాచరణ, వివిధ రూపాల సామాజిక కార్యాచరణ కలిగించే ప్రభావం వల్ల ప్రపంచంలో మార్పులు జరుగుతాయి. సత్యాన్ని గ్రహించడానికి, ఏది సత్యమో నిర్ధారించడానికి ఆచరణే కొలమానం. ఆవిధంగా మానవుల కార్యాచరణలను గుదిగుచ్చితే అది సిద్ధాంతంలో భాగంగా మారుతుంది.

"ఇంతవరకూ తత్వవేత్తలు పలువాధాలుగా ప్రపంచాన్ని వివరించారు. ఐతే కావలసింది దానిని మార్చడం" మార్క్స్ (ఫ్యూయర్‌బా పై నిర్ధారణలు నుంచి) పై ప్రకటనను వివరిస్తూ మార్క్స్ ఇంకా ఇలా అన్నారు "సామాజిక జీవితం ప్రధానంగా ఆచరణాత్మకం. సిద్ధాంతాన్ని ఆధ్యాత్మికత వైపు నెట్టే అన్ని రహస్యాలనూ హేతుబద్ధంగా పరిష్కరించగలిగేది మానవుల కార్యాచరణ మాత్రమే"

సిద్ధాంతం (జ్ఞానం) కూడా ముఖ్యమైనది. "విప్లవకర సిద్ధాంతం లేకుండా విప్లవోద్యమం అనేది ఉండదు." అని లెనిన్ అన్నారు. ఇక్కడ లెనిన్ సిద్ధాంతం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఎందుకంటే అది ఆచరణకు మార్గదర్శకంగా ఉంటుంది. సిద్ధాంతం, ఆచరణ రెండూ సన్నిహిత సంబంధం కలిగివున్నాయి. విప్లవోద్యమానికి రెండూ ముఖ్యమైనవే. "విప్లవ కార్యాచరణతో సంబంధం లేకుండా ఉంటే సిద్ధాంతం నిష్ప్రయోజనం. అదే విధంగా విప్లవ సిద్ధాంతం వెలుగు చూపనిదే ఆచరణ చీకట్లో

తడుములాడుకుంటుంది." అని స్టాలిన్ అన్నారు. సిద్ధాంతాన్ని, ఆచరణను విడదీస్తే అది అన్ని రకాల పొరపాట్లకు, తప్పుదారులకు దారి తీస్తుంది. అవకాశవాదం, దుస్సాహసిక వాదం, అనుభవవాదం, పిడివాదం వంటివి ఆ విధంగానే ఉత్పన్నం ఔతాయి.

**1) గతి తర్కం**

**విశ్వం – పరస్పర సంబంధాలు**

ఈ విశ్వం లోని అన్ని పదార్థాలూ, అన్ని ప్రక్రియలూ పరస్పరం సంబంధాలు కలిగివున్నాయి. అదేవిధంగా పరస్పరం ఆధారపడివున్నాయి. అందుచేత వాటిని విడివిడిగా మాత్రమే పరిశీలించడం తీవ్ర తప్పిదమౌతుంది. ఒక వ్యక్తిని అతడి లేదా ఆమె కుటుంబం నుంచి, జీవించే సమాజం నుంచి వేరుచేసి అంచనా వేయడం అసమగ్రం, అసంపూర్ణం ఔతుంది. యాంత్రిక చలనం కారణంగా ధూళి కణాలు, వాయు మేఘాలు దగ్గరౌతాయి. అవి ద్రవ రూపంలో దగ్గరవడానికి కారణం భౌతిక చలనం. ఆ దగ్గరవడం వల్ల వేడి పుడుతుంది. యాంత్రిక చలనం నుండి భౌతిక చలనం (భౌతికమైన మార్పు) వచ్చింది. ఈ భౌతిక చలనాన్ని అర్థం చేసుకోవాలంటే దానిని విడిగా పరిశీలిస్తే సాధ్యం కాదు. భూమి పుట్టినప్పుడు దాని ఉపరితలం యావత్తూ నీటితో నిండి వుంది. అకర్బన ప్రతిచర్యలు (ఇనార్గానిక్ రియాక్షన్స్) ఆ నీటిలో ప్రారంభమయ్యాయి. ఇది అనేక సమ్మేళనాలు ఏర్పడడానికి దారి తీసింది. చివరికి అది జీవం పుట్టుకకు దారి తీసింది. ఇదంతా ఒక రసాయన చలనం. భౌతిక చలనం, రసాయన చలనం కలిసి భూమి పైన జీవం ఏర్పడడానికి దారి తీశాయి. జీవ పరిణామ క్రమంలో భాగంగా మానవుడు ఆవిర్భవించాడు. ఇది సకర్బన చలనం జరిగినట్టు సూచిస్తుంది. (ఆర్గానిక్ మోషన్) ఈ సకర్బన చర్య రసాయన చర్యతో సంబంధం కలిగివుంది. మానవుడు ఉనికిలోకి వచ్చాక మానవ సమాజాలు ఏర్పడ్డాయి. అభివృద్ధి క్రమంలో సమాజం క్రమంగా ముందుకు సాగింది. వివిధ రకాల సమాజాలను ఇప్పటికే చూశాం. ఈ అభివృద్ధి క్రమంలో ఒక కొత్త సమాజ రూపం ఆవిర్భవించింది. అదే సోషలిస్టు సమాజం. ఇప్పటికే అది పలు దేశాలలో ఏర్పడింది. మానవ సమాజం అంతిమంగా కమ్యూనిస్టు సమాజంగా పరిణామం చెందుతుంది. ఈ యావత్తు ప్రక్రియ సామాజిక చలనం కిందకు వస్తుంది. ఇది జీవ ప్రక్రియ మీద ఆధారపడివుంది. ఈ రెండింటినీ వేరు చేసి చూడలేం.

భౌతిక ప్రపంచం లక్షణం కేవలం పరిణామం చెందడం మాత్రమే కాదు. ఇదంతా పరస్పరం సంబంధం కలిగివున్న ఒక మొత్తం. (విశ్వం). పదార్థం, ఘటనలు దేనికవిగా పరిణామం చెందవు. వాటి పరిణామం తక్కిన పదార్థాలపైన. ఘటనల

పైన ఆధారపడివుంటుంది. అందుచేత పదార్థాన్ని, ఘటనలను  తక్కిన విశ్వంతో ఉన్న సంబంధాల దృష్టి నుంచి పరిశీలించాలి. ఈ మొత్తం ప్రపంచాన్ని ఒకే ఒక్క విశ్వంగా పరిగణించి అంచనా వేయడం గతితార్కిక భౌతికవాదం ప్రధాన లక్షణం. అందులో ప్రతీ పదార్థాన్నీ, ఘటననూ ఇతర పదార్థాల, ఘటనలతో ఉన్న సంబంధాల నేపథ్యంలో పరిశీలించాలి.

పదార్థం, ప్రక్రియలు, ఘటనలు వివిధ పరిమాణాలలో, వివిధ స్థాయిలలో బహు ముఖంగా కొనసాగుతూవుంటాయి. అందుచేత వాటి మధ్య అంతః సంబంధాలు కూడా బహుముఖంగా ఉంటాయి. ఈ మొత్తం సంబంధాల సంపూర్ణ చిత్రాన్ని అంచనా వేయడం కాకుండా, అన్ని రకాల పదార్థాలకు ఉమ్మడిగా వర్తించే సాధారణ సంబంధాలను మార్క్సిస్టు గతితర్కం నిర్ధారిస్తుంది. ఈ అంత:స్సంబంధాలను అధ్యయనం చేయడం ద్వారా సంక్రమించే జ్ఞానం వాస్తవ జీవితంలో వర్తించే కొన్ని నియమాలను తెలుసుకోడానికి తోడ్పడుతుంది. దైనందిన మానవ జీవితం నడవడానికి అటువంటి పరిజ్ఞానం చాలా అవసరం.

పదార్థం, ఘటనలు అన్నింటికీ ఉన్న పరస్పర సంబంధాలలో అనేక తరహాలు ఉన్నాయి. భౌతిక ప్రపంచం లోని పరస్పర అంతః సంబంధాల గురించి, విశ్వవ్యాప్త పరిణామం గురించి స్పష్టమైన అవగాహనకు రావడానికి మార్క్సిస్టు గతితర్కం తోడ్పడుతుంది. అందుచేత మార్క్సిస్టు గతితర్కం యొక్క ప్రాథమిక సూత్రాలను ముందు అధ్యయనం చేయాలి.

గతి తర్కంలో  అంతిమంగా దిగువ పేర్కొన్న భావనలు ఉన్నాయి: ప్రత్యేకం-సార్వత్రికం, రూపం-విషయం, రూపం-సారం, ఆవశ్యకత-యాదృచ్ఛికత, అవకాశాలు- వాస్తవం, భాగం- పూర్ణం వగైరాలు. ఈ భావనలను గతితర్క విభాగాలు అని అంటారు. (కేటగరీస్) “మన చుట్టూ ఉండే అనేక పదార్థాల, ఘటనలకు సంబంధించిన భావనల అల్లికలగూడులో మనిషి ఉంటాడు. గతితర్క విభాగాలు వాటిని దేనికదే గుర్తించడానికి, అంటే ప్రపంచాన్ని గురించి తెలుసుకోడానికి తోడ్పడతాయి. ఆ అల్లికల గూడులో ప్రధాన స్థానాలను గుర్తించడానికి, తద్వారా ప్రపంచాన్ని గురించి తెలుసుకుని దానిమీద ఆధిపత్యం సాధించడానికి తోడ్పడతాయి.” అని లెనిన్ అన్నారు.

***(లెనిన్ కలెక్టెడ్ వర్క్స్, వాల్యూం 38)***

## ప్రత్యేకం-సార్వత్రికం (స్పెసిఫిక్-యూనివర్సల్)

ప్రతీ పదార్థానికీ దానికే చెందిన ప్రత్యేక లక్షణాలు ఉంటాయి. వాటిని తెలుసుకోవడం ద్వారా తక్కిన పదార్థాలకంటె అవి ఏ విధంగా వేరుగా ఉన్నాయో

తెలుస్తుంది. అదే సమయంలో ప్రతీ పదార్థానికీ దాని ప్రత్యేక లక్షణాలు ఉన్నా, అది తక్కిన పదార్థాలతోపాటు కొన్ని ఉమ్మడి లక్షణాలను కలిగివుంటుంది. అటువంటి ఉమ్మడి లక్షణాలను (సాధారణ లక్షణాలను) సార్వత్రిక లక్షణాలు అంటాం. అంటే ప్రత్యేకమైన దానిలో కొంత భాగం సార్వత్రికంగా ఉంటుంది. అందుచేత ప్రతీ పదార్థమూ ఆ సార్వత్రిక లక్షణాల ద్వారా తక్కిన పదార్థాలతో సంబంధం కలిగివుంటుంది.

ప్రతీ ప్రత్యేక పదార్థానికి సార్వత్రిక లక్షణాలు ఉంటాయి. అదే సమయంలో ప్రతీ సార్వత్రిక లక్షణం ప్రత్యేక పదార్థాల ద్వారానే వ్యక్తం ఔతుంది.

ప్రతీ వ్యక్తికీ తన స్వంత ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. అదే వ్యక్తి సార్వత్రికమైన ఈ మానవ సమాజంలో అంతర్భాగంగా ఉంటాడు. దానితో సంబంధం కలిగివుంటాడు. ఇనుము అనేది ఒక ప్రత్యేక తరహా లోహం. అదే సమయంలో అది సార్వత్రికమైన 'లోహం' అనే తరహాకు చెందిన పదార్థం. మానవ సమాజం అనేది సార్వత్రికం అయితే, అందులో పెట్టుబడిదారీ సమాజం అనేది ప్రత్యేక సమాజ రూపం.

మార్పు జరిగే క్రమంలో ఒక్కోసారి ప్రత్యేక లక్షణం సార్వత్రిక లక్షణంగా మారిపోతుంది. మరికొన్ని సార్లు సార్వత్రిక లక్షణం ప్రత్యేక లక్షణం అయిపోతుంది. పెట్టుబడిదారీ విధానం అనేది ప్రత్యేక సామాజిక వ్యవస్థ. కార్మికవర్గాన్ని దోపిడీ చేయడం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క సార్వత్రిక లక్షణం. కాని పరిణామ క్రమంలో అది మొత్తం ప్రపంచ వ్యాప్త లక్షణంగా మారిపోయింది. సోషలిజాన్ని గురించి కూడా ఇదే విధంగా చెప్పుకోవచ్చు.

ప్రత్యేక, సార్వత్రిక లక్షణాల మధ్య ఉన్న గతితార్కిక సంబంధం గురించిన పరిజ్ఞానం వాస్తవ జీవితపు అయోమయంలో మనకు సరైన మార్గాన్ని చూపుతుంది. పరిణామక్రమానికి సంబంధించిన సూత్రాలను తెలుసుకోడానికి, వాటిని ఆచరణలో వర్తింపజేయడానికి తోడ్పడుతుంది. ఈ పరిజ్ఞానం మనకు పదార్థం, ఘటనలు–వాటి ప్రక్రియలను గుర్తించడానికి, మనకు ఎన్నో తెలియని పదార్థాలని, ప్రక్రియలని తెలుసుకోడానికి తోడ్పడుతుంది.

## రూపం–విషయం (ఫార్మ్ – కంటెంట్)

ఒకానొక పదార్థంలో ఉండే వివిధ అంతర్భాగాలు, ఒకానొక ఘటనలో ఉండే వివిధ అంశాలు, వాటికి సంబంధించి కొనసాగే ప్రక్రియలు ఆయా పదార్థపు విషయం, లేదా ఆ ఘటన యొక్క విషయం ఔతాయి. ఆ విషయం ఏ విధంగా నిర్మితమై ఉందో అది దాని రూపం ఔతుంది. అణువులో ఉండే మూల పదార్థాలు (ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, వగైరా) వాటి స్థానాల్లో కలిగే మార్పులు అన్నీ కలిసి అణువు

యొక్క విషయం ఔతాయి. ఈ వివిధ మూల పదార్థాలు ఆ అణువులో ఏ చట్రంలో అమరివున్నాయో అది ఆ అణువు యొక్క రూపం ఔతుంది.

సమాజంలో ఒకానొక సమయంలో ఉండే ఉత్పత్తి శక్తులు, వాటి అభివృద్ధి ఆ సమాజపు విషయం ఔతాయి. ఆనాటి ఉత్పత్తి సంబంధాలు ఆ సమాజపు రూపం ఔతుంది. రూపం, విషయం పరస్పర సంబంధం కలిగివుంటాయి. విషయం లేని రూపం గాని, రూపం లేని విషయం గాని ఉండడం అసంభవం. రూపం, విషయం – ఈ రెండింటి ఐక్యతే పదార్థం. ఒక దోపిడీ సమాజం నుండి దోపిడీరహిత సోషలిస్టు సమాజానికి పరిణామం చెందడం అనివార్యంగా జరుగుతుంది.

విషయంలోని అంతర్గత వైరుధ్యాల కారణంగా ఆ విషయం నిరంతరం మార్పులకు లోనవుతూ వుంటుంది. ఆ క్రమంలో అభివృద్ధి జరుగుతుంది. ఉదాహరణకు పెట్టుబడిదారీ వ్యవస్థనే తీసుకోండి. పెట్టుబడికి, శ్రమకు మధ్య వైరుధ్యం నానాటికీ తీవ్రమౌతూవుంటుంది. విషయంలో జరిగే ప్రతీ మార్పూ రూపంలో మార్పుకు దారి తీయనవసరం లేదు. ఈ విషయంలో జరిగే మార్పు ఫలితంగా కొత్త విషయం రూపొందుతుంది. ఇది అంతకుముందునుంచీ ఉన్న రూపంతో ఉన్న వైరుధ్యం ఫలితంగా ఒక క్రమంలో కొత్త రూపం ఏర్పడడానికి దారి తీస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతకంతకూ ఉత్పత్తి శక్తుల సామాజీకరణ చెందడం, అదే సమయంలో సంపదపై అధికారం అంతకంతకూ వ్యక్తిగతం కావడం జరుగుతుంది. సామాజికీకరణ చెందుతున్న ఉత్పత్తి శక్తుల పురోగతికి వ్యక్తిగత యాజమాన్యం ఆటంకంగా మారుతుంది. అప్పుడు మారిన విషయానికి అనుగుణంగా రూపాన్ని మార్చవలసిన అగత్యం ఏర్పడుతుంది. విషయమే రూపాన్ని నిర్ణయిస్తుంది. కొత్త రూపం ఏర్పడ్డాక ఆ పరిధిలో విషయం మళ్లీ పురోగమించడం ప్రారంభిస్తుంది.

## సారం–స్వరూపం (ఎసెన్స్– ఎప్పియరెన్స్)

ఏ పదార్థానికైనా, ఏ ఘటన కైనా, ప్రాథమికంగా, అంతర్గతంగా ఉండే విషయమే దాని సారం. అది సాపేక్షంగా స్థిరంగా ఉంటుంది. పదార్థానికి గాని, ఘటనకి గాని సంబంధించిన వివిధ అంశాలను నిర్ణయించేది దాని సారమే. ఈ సారం ఒక స్వరూపంగా వ్యక్తమౌతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థపు సారం అదనపు విలువను సృష్టించడం, దానిని స్వాధీనం చేసుకోవడం. ఐతే దాని స్వరూపం వల్ల సమానత్వం ఉంది అన్న భ్రమ కలుగుతుంది. ఆ వ్యవస్థలే అమలు జరిగే వేతన వ్యవస్థ ఈ భ్రమకు కారణం. జీవం ఉన్న దానికి జీవప్రక్రియ (మెటబాలిజమ్) అనేది సారం. ఆ జీవప్రక్రియ ఉద్రిక్తత వంటి లక్షణాల స్వరూపంలో వ్యక్తమౌతుంది.

సారం, స్వరూపం పరస్పరం సంబంధం కలిగివుంటాయి. ఈ రెండింటినీ విడదీయలేం. ఆ రెండూ ఒక్కటిగానే ఉన్నా, వాటి మధ్య పరస్పర వ్యతిరేకత ఉంటుంది. సారం, స్వరూపం ఒక్కటిగానే కనిపించవు. సారం పైకి నేరుగా కనిపించకుండా లోలోపలే ఉంటుంది. పదార్థాన్ని, లేదా ఘటనను లోతుగా అధ్యయనం చేసినప్పుడే దాని సారం బైట పడుతుంది. ఘటనలతో సంబంధం లేకుండా సారం ఉండదు. ఈ ఘటనల ప్రపంచంతో మార్పులు, పరివర్తనల ద్వారా సారం కలిసేవుంటుంది. అదే సమయంలో పైపైకి కనిపించే వాటినుండి మొదలై వాటి వెనుక ఉన్నదానితో అది కలిసివుంటుంది.

పదార్థం గాని ఘటన గాని, ఎంత సంక్లిష్టమైనదైనప్పటికీ, దానిని అర్థం చేసుకుని దాని వెనుక దాగివున్న సారాన్ని బైటకు తీయడానికి కావలసిన ఆత్మవిశ్వాసం మనకు సారం–స్వరూపం కు సంబంధించిన జ్ఞానం ద్వారా కలుగుతుంది. ఒక్కోసారి మనకు కనిపించే స్వరూపం దాని సారాన్ని గ్రహించనివ్వకుండా తప్పుదోవ పట్టిస్తుంది. ఉదాహరణకు: మనం మామూలుగా చూస్తే భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నట్టు అనిపిస్తుంది. కాని వాస్తవం అందుకు పూర్తి విరుద్ధం. అందుచేత ఏదైనా పదార్థాన్ని గాని, ఘటనను గాని తెలుసుకోవాలంటే దాని సారాన్ని తెలుసుకోవడం అత్యంతావశ్యం. "పైకి కనిపించేదీ, దాని సారమూ గనుక ఒక్కటే ఐతే యావత్తు శాస్త్ర విజ్ఞానమూ కొరగానిదే ఔతుంది." –– మార్క్స్

## కారణం – కార్యం (కాజ్ – ఎఫెక్ట్)

ఒకానొక ఘటన దేని వల్ల జరిగిందో దానిని 'కారణం' అంటాం. ఆ కారణం వల్ల ఏమి జరిగిందో దానికి 'కార్యం' అంటాం. కారణానికి, కార్యానికి మధ్య ఒక (భౌతికమైన) లౌకికమైన సంబంధం ఉంది. కారణం ముందు వస్తుంది, ఆ తర్వాత కార్యం వస్తుంది. కార్య, కారణ సంబంధం అనేది తప్పనిసరి. ఒక కార్యం జరిగిందంటే దానికి కారణం తప్పనిసరిగా ఉండాలి. ఒక ఘటన వెనువెంటనే జరిగే మరొక ఘటన ఉంటుంది. అటువంటప్పుడు ఆ రెండో ఘటనకు కారణం మొదటి ఘటన అని భావించరాదు. ఉదాహరణకి : రాత్రి తర్వాత పగలు వస్తుంది. కాని పగలు రావడానికి కారణం రాత్రి కాదు. రాత్రి, పగలు ఏర్పడడానికి కారణం భూమి తన చుట్టూ తాను తిరగడం.

కారణం, భాగం (ఘటన లోని భాగం) ఒక్కటే కాదు. తనంతట తానుగా ఒక భాగం కార్యం జరిగేట్టు చేయలేదు. కారణం వేగంగా జరగడానికి దోహదం చేయగలదు. అంతే. కార్యం జరగాలంటే అందుకు వేరే ఉత్ప్రేరకం కావాలి.

కారణం, కార్యం –రెండూ పరస్పరం సంబంధం కలిగివున్నాయి. అదే సమయంలో కార్యం కారణం గాను, కారణం కార్యం గాను మారిపోవచ్చు. కారణం కార్యం ఔతుంది, కార్యం కారణం ఔతుంది. ఏదైనా ఒక కార్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలంటే ప్రాథమికమైన, నిర్ణయాత్మకమైన కారణం ఏమిటో తెలుసుకోవాలి. అప్పుడే మనం సరైన దిశగా కార్యాచరణ చేపట్టగలుగుతాం. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి సాధనాలు వ్యక్తిగత ఆస్తిగా ఉండడం కారణం ఔతుంది. ఉత్పత్తి లోపోటీ, అరాచకం నెలకొనడం కార్యం ఔతుంది.

## ఆవశ్యకత – యాదృచ్ఛికత (నెసెసిటీ – ఛాన్స్)

ప్రకృతిలో జరిగే ప్రతీ ఘటనకూ కార్యకారణ సంబంధం వర్తిస్తుంది కనుక ఈ విశ్వం ఆవశ్యకతకు లోబడి ఉంటుంది. ఒకానొక నిర్దిష్ట పరిస్థితిలో తప్పనిసరిగా జరగవలసిన పరిణామాన్నే 'అవశ్యకత' అంటాం. యాదృచ్ఛికత వేరు. ఒక నిర్దిష్ట పరిస్థితిలో వర్షం కురవడం అనేది యాదృచ్ఛికత. వడగళ్ళ వాన కూడా అంతే.

ఒకానొక నిర్దిష్ట పరిస్థితిలో జరగనూ వచ్చు, లేదా జరగకపోవచ్చు అన్న ఘటనను యాదృచ్ఛికత అంటాం. వడగళ్ళ వాన కారణంగా పంట నష్టం జరగనూ వచ్చు, జరగకనూ పోవచ్చు. అది యాదృచ్ఛికత.

ఆవశ్యకతకు, యాదృచ్ఛికతకు మధ్య గతితార్కిక సంబంధం ఉంది. అభ్యుదయం వైపుగా పురోగమించడం అనేది ఒక ఆవశ్యకత. ఐతే ఈ ఆవశ్యకత కొన్ని యాదృచ్ఛిక ఘటనల ద్వారా వ్యక్తం ఔతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి సోషలిజం వైపు పురోగమించడం ఆవశ్యకత. అదే సోషలిజం ఎక్కడైనా పతనం అయితే అది యాదృచ్ఛికత. కొన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో యాదృచ్ఛికత ఆవశ్యకతగా మార్పు చెందుతుంది. ఉదాహరణకు: బానిస సమాజంలో చేసిన శ్రమకు కూలి చెల్లించడం యాదృచ్ఛికంగా జరిగే విషయం. అదే పెట్టుబడిదారీ వ్యవస్థలో వేతన శ్రమ అనేది ఆవశ్యకత అయింది.

స్వేచ్ఛ–ఆవశ్యకత: ప్రకృతికి, సమాజానికి వర్తించే భౌతిక నియమాలకు, మానవ కార్యాచరణకు మధ్య ఉండే అంతః సంబంధాన్ని ఇవి తెలియజేస్తాయి. స్వేచ్ఛ' అనేది ప్రతీ ఒక్కరికీ కావలసిన ఆవశ్యకత అని, ఆవశ్యకత ను నియతివాదం (డిటర్మినిజం) అని భావవాదులు అంటారు. స్వేచ్ఛకు, ఆవశ్యకతకు మధ్య ఉన్న సజీవ సంబంధాన్ని మార్క్సిజం గుర్తించింది. స్వేచ్ఛ గురించి అతిగా నొక్కితే అది ఎవరికి తోచిన విధంగా వారు వ్యవహరించే ధోరణికి దారి తీస్తుంది. అదే ఆవశ్యకత గురించి అతిగా నొక్కితే అది నియతివాదానికి, ఫాటలిజానికి (అలా జరగాలని రాసిపెట్టివుంది అనడం ఫాటలిజం) దారి తీస్తుంది. భౌతిక నియమాల రూపంలో

ఆవశ్యకత ఈ ప్రకృతిలో ఉంది. ఆ నియమాలు మనకు అర్థం కానంతకాలం గుడ్డిగా మనం ఆవశ్యకతను అనుసరిస్తాం. ఆ భౌతిక నియమాలగురించి మానవులు తెలుసుకుంటున్న కొద్దీ వారి కార్యాచరణ మరింత స్వేచ్ఛగా, చైతన్యయుతంగా సాగుతుంది. "ఆవశ్యకత అనే రాజ్యం నుంచి స్వేచ్ఛారాజ్యం వైపు ఒక పెద్ద గంతు వేస్తాం" అని ఎంగెల్స్ అన్నారు.

## అవకాశం–వాస్తవం (పాసిబులిటీ–రియాలిటీ)

పరిణామక్రమానికి సంబంధించిన నియమాలకు అనుగుణంగా జరిగే వీలు ఉండి, ఇంకా జరగని ఘటనను 'అవకాశం' అంటాం. ఈ భూమండలాన్ని అణుయుద్ధ ప్రమాదం నుండి కాపాడి ప్రపంచ శాంతిని నెలకొల్పే అవకాశం ఉంది. అభివృద్ధి చెందిన దేశాలమీద ఆధారపడకుండా ఉండే స్థితికి అభివృద్ధి చెందుతున్న దేశాలు చేరుకునే అవకాశం ఉంది. ప్రపంచంలో సోషలిజాన్ని నెలకొల్పే అవకాశం ఉంది.

ఆచరణలో జరిగింది వాస్తవం ఔతుంది. వర్తమానం ఒక వాస్తవం. ఈ వాస్తవ స్థితిలో సానుకూల, ప్రతికూల అవకాశాలు, అభ్యుదయ, తిరోగమన ఘటనలకు అవకాశాలు ఉంటాయి. మనం వాటిలో సానుకూల, అభ్యుదయ అవకాశాలను పెంపొందించడం కోసం పూనుకోవడం ముఖ్యం.

## పూర్ణం – భాగం (హోల్ – పార్ట్)

కొన్ని భౌతిక విషయాల కలయికకు, లేదా ఒకే భౌతిక విషయంలోని మూలకాల కలయికకు, ఆ కలయిక ద్వారా కొత్త ధర్మాలను కలిగించిన సంబంధానికి నడుమ ఉండేదే పూర్ణం– భాగం అనే తరహా. కొత్త గా సంక్రమించిన ఆ ధర్మాలు ఆ భౌతిక విషయాలు విడివిడిగా ఉన్నప్పుడు వాటిలో వ్యక్తం కావు.

ప్రతీ పదార్థమూ పూర్ణమే. దానిలో అనేక భాగాలు ఉంటాయి. ఈ భూమి ఒక పూర్ణమైన భౌతిక విషయం. పసిఫిక్ మహాసముద్రం అందులోని ఒక భాగం. అటువంటి భాగాలన్నీ కలిస్తే అది పూర్ణం ఔతుంది. మానవ శరీరం ఒక పూర్ణ భౌతిక విషయం. కాళ్ళు, చేతులు అందులో భాగాలు. ఆ భాగాలలో కొన్ని ముఖ్యమైనవిగా ఉండవచ్చు. మానవ శరీరానికి మెదడు అత్యంత ముఖ్యమైన భాగం. విప్లవోద్యమం ఒక పూర్ణ విషయం. అందులో పాల్గొనే శక్తులు భాగాలుగా ఉంటాయి. అన్ని భాగాలూ అవసరమే. ప్రస్తుత ప్రపంచంలో నాలుగు ప్రధాన సామాజిక వైరుధ్యాలు ఉన్నాయి. సామ్రాజ్యవాదానికి, సోషలిజానికి నడుమ ఉండే వైరుధ్యం అందులో ఒక భాగం. ఐతే అది కేంద్ర వైరుధ్యంగా ఉంటుంది. ఈ వైరుధ్యాన్ని పరిష్కరించడం తక్కిన అన్ని వైరుధ్యాల పరిష్కారానికీ దారి తీస్తుంది.

## (2) గతితర్కం – పరిణామ క్రమానికి సంబంధించిన ఒక సిద్ధాంతం

పదార్థం నిరంతరం చలనంలో ఉంటుంది. పదార్థం లేనిదే చలనం లేదు. అదే విధంగా చలనం లేకుండా పదార్థం లేదు. పదార్థం యొక్క ప్రతీ చర్యా చలనం అని గమనించాలి. ఐతే, చలనం అంటే కేవలం యాంత్రిక చలనం మాత్రమే కాదు. చలనం వల్ల మార్పులు జరుగుతాయి. శాశ్వతమైనది, అంతిమ సత్యం అనేది ఏదీ లేదు. ఏదీ శాశ్వతం కాదు. ప్రతీదానినీ చలనం లేదా మార్పు జరుగుతున్న క్రమంలోనే అర్థం చేసుకోవాలి. అనేక ప్రక్రియలన్నింటి సమగ్ర రూపమే ఈ విశ్వం.

ప్రతీ పదార్థమూ, ప్రతీ ప్రక్రియా నిరంతర మార్పులో ఉంటాయి. పుట్టుక, వృద్ధి, పరిణామం, పతనం లేదా అంతం అనేవి నిరంతరం సాగుతూవుంటాయి. ఇలా పుట్టడం, వృద్ధి చెందడం, పరిణామానికి లోను కావడం, పతనం కావడం అనేవి కేవలం ప్రాకృతిక ప్రపంచానికి మాత్రమే వర్తించేవి కావు. సామాజిక, చారిత్రిక ప్రక్రియలకూ వర్తిస్తాయి. మానవ చరిత్ర నిరంతర మార్పుల ద్వారా అభివృద్ధి చెందుతోంది. అదే విధంగా సామాజిక నిర్మాణాలు, సామాజిక ఘటనలు కూడా మార్పు జరిగే క్రమంలోనే అభివృద్ధి చెందుతున్నాయి. ఆ అభివృద్ధి జరిగే క్రమంలో ప్రతీ ఘటననూ, దాని పరిణామాన్ని చూడకపోతే అది తీవ్ర తప్పిదమౌతుంది.

మరింత స్పష్టంగా వివరించడానికి ఉదాహరణలు కొన్ని:

- భూగ్రహం ఏర్పడడం ఒకానొక చలన రూపం.
- జీవం ఏర్పడడం, ఏకకణజీవి నుంచి బహుకణజీవులు పరిణామం చెందడం, వెన్నెముక లేని జీవుల నుండి వెన్నెముక గల జీవులు పరిణామం చెందడం, అక్కడినుండి మానవ పరిణామం, – ఇదంతా చలనరూపమే.
- లక్షల సంవత్సరాల పరిణామం ఫలితంగా ఏర్పడిన ఆదిమ సమాజం నుండి వివిధ వ్యవస్థల రూపాల ద్వారా ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజం పరిణామం చెందడం– ఈ యావత్తు క్రమమూ ఒక చలన రూపమే.
- మెదడు దాని పనిలో భాగంగా, ఒక చలన రూపంగా చైతన్యం అనేది రూపొందింది.

## (3) పరిణామక్రమానికి సంబంధించిన ప్రాథమిక నియమాలు

ప్రతీదానినీ పరిణామక్రమంలోనే గతితర్కం పరిశీలిస్తుంది. ఏదీ స్థిరంగా ఉండిపోదు. అత్యంత చిన్న పదార్థం నుండి బ్రహ్మాండం వరకూ ప్రతీ పదార్థమూ పరిణామ క్రమంలోనే ఉంటుంది. ఈ పరిణామం జరిగే క్రమం కొన్ని నియమాలకు లోబడివుంటుంది. మార్పుకు, పరిణామానికి దారితీసే చలనం ఎక్కడినుంచి వచ్చింది?

పరిణామక్రమాన్ని నడిపించేది, దిశానిర్దేశం చేసేది ఏది? ఇటువంటి ప్రశ్నలకు సమాధానం పరిణామక్రమానికి సంబంధించిన నియమాలలో తెలుసుకోవచ్చు. మూడు ప్రధాన నియమాలు ఉన్నాయి.

## (అ) పరస్పర విరుద్ధ శక్తుల మధ్య ఐక్యత–పోరాటం – వైరుధ్యాలు

ప్రతీపదార్థంలోనూ ఘటన లోనూ పరస్పరం వ్యతిరేకంగా ఉండేవి ఉంటాయి. అంటే, ప్రతీ పదార్ధంలోను, ఘటనలోను వ్యతిరేక దిశలో వ్యవహరించే శక్తులు ఉంటాయి. ఈ పరస్పర వ్యతిరేక శక్తులనుండే చలనం కలుగుతుంది. ఈ పరస్పర విరుద్ధ శక్తులమధ్య ఉండే ఘర్షణలనే వైరుధ్యాలు అంటాం. ప్రతీ పదార్ధంలో, ప్రతీ ఘటనలో పరస్పర వ్యతిరేక శక్తులు ఉన్నాయి గనుక ప్రతీ పదార్ధంలోను, ఘటన లోను వైరుధ్యాలు ఉంటాయి, వాటితోబాటు ఆ వ్యతిరేక శక్తుల మధ్య ఐక్యత కూడా ఉంటుంది. ఐతే ఈ ఐక్యత తాత్కాలికమే. మనచుట్టూ ఉన్న ఘటనలలో, పదార్ధంలో పరస్పర వ్యతిరేక శక్తులు ఉన్న ఉదాహరణలు చాలానే ఇవ్వవచ్చు. అంటే ఐక్యత, పోరాటం ప్రతీ పదార్ధంలో, ఘటనలో ఉన్న ఉదాహరణలు చాలా ఇవ్వ వచ్చు. కొన్నింటిని దిగువన ఇస్తున్నాం:

**అకర్బన ప్రపంచంలో**

| | | |
|---|---|---|
| అణువు | పాజిటివ్ కేంద్రకం (న్యూక్లియస్) | నెగెటివ్ ఎలక్ట్రాన్ |
| మూల పదార్థం | పాజిట్రాన్ | ఎలక్ట్రాన్ |
| గ్రహాల సంచారం | ఆకర్షణ | వికర్షణ |

**సకర్బన ప్రపంచంలో**

| | | |
|---|---|---|
| జీవ ప్రక్రియ | జీర్ణించుకోవడం | విసర్జించడం |
| జీవజాతుల | పాత లక్షణాలు | వారసత్వంగా |
| ఆవిర్భావం | అంతరించిపోవడం | లక్షణాలు కొనసాగడం |
| పాడీ వ్యవస్థ పని | ఆవేశపడడం | మొహమాటం |

**మానవ సమాజం**

| | | |
|---|---|---|
| ఘర్షణ | దోపిడీకి గురయేవారు | దోపిడీ చేసేవారు |
| తార్కికంగా గ్రహించడం | విశ్లేషణ | సంశ్లేషణ |

| | |
|---|---|
| సాధారణీకరణ | నిర్దిష్టపరచడం |

### గణితం, యాంత్రిక శాస్త్రం

---

| | |
|---|---|
| ప్లస్ (+) | మైనస్ (–) |
| అవకలనం | సమగ్రం |
| చర్య | ప్రతిచర్య |

### సమాజ పరిణామం, వర్గ పోరాటం

---

| | | |
|---|---|---|
| ఉత్పత్తి శక్తులు | ఉత్పత్తి సంబంధాలు | |
| | భూస్వామి | కౌలురైతు |
| | పెట్టుబడిదారుడు | కార్మికులు |

### అర్థశాస్త్రం

---

| | |
|---|---|
| ఉపయోగపు విలువ | మారకపు విలువ |

---

వైరుధ్యాలు వివిధ కూపాలలో ఉంటాయి. ఉదా: ప్రధాన వైరుధ్యాలు, చిన్న వైరుధ్యాలు.

నిర్ణయాత్మకంగా ఉండేవి ప్రధాన వైరుధ్యాలు. నేటి ప్రపంచంలో నాలుగు ప్రధాన సామాజిక వైరుధ్యాలు ఉన్నాయి.

(1) పెట్టుబడికి శ్రమకు నడుమ వైరుధ్యం.,

(2) సామ్రాజ్యవాద దేశాలకు, మూడవ ప్రపంచ దేశాల ప్రజలకు నడుమ వైరుధ్యం.,

(3) సామ్రాజ్యవాద దేశాలమధ్య వైరుధ్యాలు.,

(4) సామ్రాజ్యవాదానికి, సోషలిజానికి మధ్య వైరుధ్యం

భారతీయ సమాజంలో మూడ ప్రధాన వైరుధ్యాలు ఉన్నాయి. అవి:

(1) సామ్రాజ్యవాదానికి, భారతదేశ ప్రజానీకానికి .,

(2) భూస్వాములకు రైతాంగానికి,

(3) గుత్త పెట్టుబడికి, ప్రజలకు.

ప్రధాన వైరుధ్యాలు చాలానే ఉన్నా, ఒకానొక పరిస్థితిలో ఏదో ఒక వైరుధ్యం ముందుకొస్తుంది. దానినే కీలక వైరుధ్యం అంటాం. (ఫోకల్) ఈ వైరుధ్యం ఏవిధంగా పరిష్కరించబడుతుంది అన్నదానిని బట్టి తక్కిన వైరుధ్యాలు తీవ్రమౌతాయా లేక పరిష్కరించబడతాయా అన్నది నిర్ధారించబడుతుంది. తక్కిన వైరుధ్యాల పరిష్కారాన్ని నిర్ణయించే వైరుధ్యాన్ని కేంద్ర వైరుధ్యం అంటాం. (సెంట్రల్) నేటి ప్రపంచంలో ఉన్న నాలుగు ప్రధాన వైరుధ్యాలలోనూ సామ్రాజ్యవాదానికి, సోషలిజానికి మధ్య ఉన్న వైరుధ్యం కేంద్ర వైరుధ్యంగా ఉంటుంది.

శతృవైరుధ్యాలు, శతృస్వభావం లేని వైరుధ్యాలు కూడా ఉన్నాయి. ఆయా వైరుధ్యం స్వభావాన్ని బట్టి అది ఈ రెంటిలో ఏ కోవకు చెందుతుందో చెప్పవచ్చు. ఒకానొక వైరుధ్యంలో ఉన్న రెండు పరస్పర విరుద్ధ అంశాలూ సర్దుబాటుకు అవకాశం లేని స్థితిలో ఉంటే ఆ వైరుధ్యం శతృవైరుధ్యం ఔతుంది. ఉదాహరణకు: పెట్టుబడిదారుడికి, కార్మికుడికి మధ్య ఉన్న వైరుధ్యం సంప్రదింపుల ద్వారా పరిష్కారం అయ్యేది కాదు. సామ్రాజ్యవాదానికి, సోషలిజానికి మధ్య వైరుధ్యం కూడా అటువంటిదే. ఇవి శతృవైరుధ్యాలు. అదే పేద రైతులకు, మధ్య తరగతి రైతులకు మధ్య ఉన్న వైరుధ్యం కాని, మధ్య తరగతికి, కార్మికవర్గానికి మధ్య ఉన్న వైరుధ్యం కాని శతృస్వభావంతో ఉండే వైరుధ్యాలు కావు. వాటిని సర్దుబాటు చేసుకోవచ్చు. అవి శతృస్వభావం లేని వైరుధ్యాలు. విప్లవోద్యమాన్ని నిర్మించే క్రమంలో మనకు శతృవైరుధ్యాలు ఏవో, శతృస్వభావం లేని వైరుధ్యాలు ఏవో తేడా తెలియకపోతే అది ఉద్యమ పురోగమనానికి ఆటంకంగా మారుతుంది.

ఒకానొక ఘటనలో గాని, పదార్థంలో గాని అంతర్గతంగా ఉండే వైరుధ్యాలతోబాటు బాహ్య వైరుధ్యాలు కూడా ఉంటాయి. అంతర్గత వైరుధ్యాలే పరిణామక్రమం యొక్క ప్రధాన దిశను నిర్ణయిస్తాయి. కాని బాహ్య వైరుధ్యాలు అంతర్గత వైరుధ్యాల పరిష్కారాన్ని ప్రభావితం చేస్తాయి. ఒకానొక దేశంలో విప్లవోద్యమం విజయవంతం కావడానికి ఆ దేశంలోని అంతర్గత వైరుధ్యాలు తీవ్రం కావడం కీలకం. కాని అంతర్జాతీయ పరిస్థితులు బాహ్యవైరుధ్యాల రూపంలో ఆ దేశంలోని విప్లవోద్యమం ముందుకుపోడానికి తోడ్పడవచ్చు.

**(ఆ) పరిమాణాత్మక మార్పుల నుండి గుణాత్మక మార్పుల వైపు**

చలనం కారణంగా మార్పులు జరుగుతాయి. మార్పు పరిణామాన్ని ప్రేరేపిస్తుంది. ఈ పరిణామ క్రమంలో ముందుగా పరిమాణాత్మక మార్పులు జరుగుతాయి. ఈ మార్పులు నెమ్మదిగా జరుగుతాయి. ఈ పరిమాణాత్మక మార్పుల క్రమంలో ఒకానొక దశలో గుణాత్మక మార్పు సంభవిస్తుంది. ఈ దశలో మార్పు

వేగంగా జరుగుతుంది. గుణాత్మక మార్పు ద్వారా పదార్థం, ఘటన ఒక కొత్త దశకు చేరుకుంటాయి.

నీటిని వేడి చేసినప్పుడు తొలుత ఉష్ణోగ్రత పెరుగుతున్నా, అది నీరుగానే ఉంటుంది. ఐతే, క్రమంగా పరిమాణాత్మక మార్పుల వేగం పెరుగుతుంది. ఉష్ణోగ్రత 100 డిగ్రీల సెల్సియస్ కు చేరగానే నీరు ఇంకెంతమాత్రమూ నీరుగా ఉండదు. అది నీటి ఆవిరిగా మారుతుంది. ఇది గుణాత్మక మార్పు. నీటి ఉష్ణోగ్రతను పెంచకుండా, అంటే పరిమాణాత్మక మార్పు లేకుండా, నీరు ఆవిరిగా మారదు. అంటే గుణాత్మక మార్పు జరగివుండేది కాదు.

**మరికొన్ని ఉదాహరణలు :**

భూమినుంచి ఏ వస్తువునైనా పైకి విసిరితే అది గురుత్వాకర్షణశక్తి వల్ల తిరిగి వెనక్కి వస్తుంది. ఐతే, పైకి విసిరే వస్తువు వేగాన్ని క్రమంగా పెంచుతూపోతే అది వెనక్కి తిరిగి రాదు. భూమి గురుత్వాకర్షణ కక్ష్యను దాటి అంతరిక్షంలోకి ప్రవేశిస్తుంది. పరిమాణాత్మక మార్పు నుంచి గుణాత్మకమార్పు జరిగేదానికి ఇది ఒక ఉదాహరణ.

**సమాజంలో విప్లవాత్మక పరిణామం :** పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి సోషలిస్టు వ్యవస్థకు జరిగే మార్పు గుణాత్మకం. ప్రజల నిరసనలు, దోపిడీకి వ్యతిరేకంగా జరిగే పోరాటాలు పరిమాణాత్మక మార్పులు. ఈ పరిమాణాత్మక మార్పులు గుణాత్మకమైన, అంటే విప్లవాత్మక పరిణామం సమాజంలో జరగడానికి దారి తీస్తాయి. ఒక కొత్త వ్యవస్థ ఆవిర్భవించడం గుణాత్మక మార్పు.

ఆదిమ సమాజం నుండి బానిస సమాజానికి, బానిస సమాజం నుండి భూస్వామ్య సమాజానికి, భూస్వామ్య సమాజం నుండి పెట్టుబడిదారీ సమాజానికి, పెట్టుబడిదారీ సమాజం నుండి సోషలిస్టు సమాజానికి, అక్కడినుండి కమ్యూనిస్టు సమాజానికి జరిగే మార్పులు గుణాత్మక మార్పులకు ఉదాహరణలు.

గుణాత్మక మార్పు జరిగాక అంతకు ముందు దశలోని సానుకూల అంశాలు, అభ్యుదయ అంశాలు ఏవీ కొత్త దశలో కొనసాగవు అని భావించరాదు. కొత్త దశలో కొనసాగదగ్గవన్నీ పరిరక్షించబడతాయి. శాస్త్ర విజ్ఞానంలో, కళా, సాహిత్య రంగాలలో బానిస సమాజంలో మానవులు సృష్టించుకున్నవి ఆ తర్వాత వచ్చిన భూస్వామ్య సమాజంలో కూడా కొనసాగాయే తప్ప వాటిని తిరస్కరించలేదు. వాటిని కొనసాగించడమే కాకుండా భూస్వామ్య వ్యవస్థ వాటిని మరింత పెంపొందించింది కూడా. అదే విధంగా భూస్వామ్య సమాజ గర్భంలో ఉన్న సానుకూల, అభ్యుదయ అంశాలు పెట్టుబడిదారీ సమాజంలో పదిలపరచబడ్డాయి. న్యూటన్, మాక్స్‌వెల్,

బాయిల్, ఐన్‌స్టీన్, డార్విన్, వంటి శాస్త్రవేత్తల పరిశోధనలు, షేక్స్‌పియర్, హెూమర్, కాళిదాసు, హ్యూగో, టాగోర్ వంటి రచయితల రచనలు, రాఫెల్, డావిన్సీ, అబనీంద్రనాథ్ వంటి చిత్రకారుల చిత్రాలు మానవ నాగరికత యొక్క అపురూప సంపదగా కొనసాగుతాయి.

**(ఇ) అభావం అభావం చెందడం**

మానవ సమాజంలో వ్యక్తిగత ఆస్తి ఏర్పడడంతో ఆదిమ సమాజం అభావం చెంది (అంతరించి) దోపిడీ సమాజపు మొదటి దశ అయిన బానిస వ్యవస్థ ఏర్పడింది. బానిస వ్యవస్థ అభావం చెంది భూస్వామ్య వ్యవస్థ, అది కూడా అభావం చెంది పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడినట్టే, ఆ వ్యవస్థ కూడా అభావం చెంది సోషలిస్టు వ్యవస్థ, ఆ తర్వాత కమ్యూనిస్టు వ్యవస్థ ఏర్పడతాయి. మానవ సమాజం పురోగమించే తీరు ఈ విధంగా ఉంటుంది. ఒకానొక సామాజిక వ్యవస్థలోని ఉత్పత్తి శక్తులు ఆ దశలో పూర్తి స్థాయికి అభివృద్ధి చెందేవరకూ ఆ సామాజిక వ్యవస్థ నాశనం కాదు. అలా పూర్తి స్థాయికి అభివృద్ధి చెందినప్పుడు పాత వ్యవస్థ ధ్వంసం కావడానికి అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయన్నమాట. అలా పూర్తి స్థాయికి ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందాక ఇంక ఏమాత్రమూ ఆ పాత వ్యవస్థ చట్రంలో అవి ఇమిడి కొనసాగడానికి సిద్ధంగా ఉండజాలవు. అప్పుడే అవి ఆ పాత వ్యవస్థలోని ఉత్పత్తి సంబంధాలతో తీవ్ర ఘర్షణకు దిగుతాయి.

అభావం అభావం చెందడం ద్వారా అభివృద్ధి ముందుకు సాగుతుంది. ఆదిమ సమాజం నుండి మానవ నాగరికత కమ్యూనిస్టు సమాజం వరకూ పురోగమించే క్రమం అభావం అభావం చెందడం ద్వారానే జరుగుతుంది. అభావం అభావం చెందడం అంటే మళ్ళీ పాత సమాజానికి వెనక్కి పోవడం ఎంతమాత్రమూ కాదు. ఆదిమ కమ్యూనిస్టు సమాజంలో మానవులునాగరికత తెలియకుండా ఆటవికంగా జీవించారు. వాళ్ళకి ప్రకృతి నియమాలు తెలియవు. భవిష్యత్తులో రాబోయే కమ్యూనిస్టు సమాజంలో మానవజాతి అత్యున్నత స్థాయి నాగరికతను చేరుకుంటుంది. ప్రకృతి నియమాలగురించి అంతకంతకూ ఎక్కువ పరిజ్ఞానాన్ని సంతరించుకుంటుంది. వాటిని మానవజాతి పురోగతికి తోడ్పడే విధంగా ఎలా ఉపయోగించాలో తెలుసుకుంటుంది.

**అభావం అభావం చెందడం– ప్రకృతిలో**

విత్తు అభావం చెంది మొక్క పుట్టుకకు దారి తీస్తుంది. మొక్క అభావం చెంది దానినుండి కంకులు వస్తాయి. ఆ కంకిలో ఎన్నో విత్తులు ఉంటాయి. అంటే ఒక విత్తు నుండి ఎన్నో విత్తులు వచ్చాయి. అభావం అభావం చెందడం ద్వారా అభివృద్ధి జరగడానికి ఇదొక ఉదాహరణ.

ఈ అభివృద్ధి క్రమం సరళరేఖ మాదిరిగా తిన్నగా ఉండదు. ఇదోక వర్తుల మార్గంలో సాగుతుంది. ఒక స్ప్రింగు చుట్టుకున్న మాదిరిగా ఉంటుంది. దిగువ దశ నుండి ఉన్నత దశ వైపు సాగుతుంది. అభివృద్ధి ఎప్పుడూ గతం నుండి భవిష్యత్తు వైపు సాగుతుంది. అభావం అభావం చెందడం అంటే

(1) పరిణామక్రమం నిరంతరాయంగా సాగడం

(2) అభ్యుదయ మార్గంలో అభివృద్ధి జరగడం

(3) పునరావృతం అవుతున్నట్టు అనిపించినా, ఉన్నత స్థాయిలో అది జరగడం.

## గతితార్కిక పద్ధతి

మన అధ్యయనాన్ని, విశ్లేషణను, ఆచరణను సరైన దిశలో చేపట్టడానికే మనం గతితార్కిక భౌతికవాదం గురించి చర్చిస్తున్నాం. కొత్త ప్రక్రియలను, ఘటనలను అధ్యయనం చేయడానికి, వివరించడానికి కావలసిన శాస్త్రీయ వైఖరిని అది మనకు అందిస్తుంది. తలెత్తే సమస్యల పరిష్కారానికి దోహదం చేస్తుంది.

**గతితార్కి పద్ధతిని ఈ విధంగా సంక్షిప్తంగా వివరించవచ్చు:**

## (1) వస్తుగత పద్ధతి, పరిశీలన

ఒకానొక పదార్థం గాని, ఘటన గాని, ప్రక్రియ గాని వాస్తవంగా ఉన్నవి ఉన్నట్టుగా అధ్యయనం చేసి అంచనా వేయడమే వస్తుగత పద్ధతి. ఉన్నవాటిని తక్కువ చేయడంగాని, లేనివి ఉన్నట్టు గాని చూపి గందరగోళపరచరాదు. వస్తుగత విశ్లేషణ లేదా అంచనాకు రావడం అంటే జీవితపు వాస్తవ చిత్రాన్ని అందించగలగాలి. జరుగుతున్న పరిణామంలోని ప్రధాన ధోరణిని పట్టుకోగలగాలి. ఆ పరిణామక్రమాన్ని శాసిస్తున్న శక్తులేవో గ్రహించగలగాలి. "సామాజిక ఘటనల పై అభిప్రాయాలు ఎప్పుడూ వాస్తవాలకు, వాస్తవ అభివృద్ధిక్రమానికి సంబంధించిన క్షుణ్ణమైన వస్తుగత విశ్లేషణ మీద ఆధారపడాలి" అని లెనిన్ అన్నారు.

## స్వీయమానసిక ధోరణి:

వస్తుగత పద్ధతికి పూర్తి వ్యతిరేకంగా ఉండేది స్వీయ మానసిక ధోరణి. ప్రకృతికి, సమాజానికి సంబంధించిన నియమాలను స్వీయమానసిక ధోరణి పట్టించుకోదు. సమాజ గమన నియమాల పట్ల చిన్నచూపుతో ఉండి ఆలోచనే సర్వస్వం అన్నట్టు వ్యవహరిస్తుంది. వ్యక్తిగత కోర్కెలు, ఉద్దేశాలు, స్వార్థప్రయోజనాలు, వ్యక్తిగత దురభిప్రాయాలు వంటివి వాస్తవాన్ని గ్రహించే క్రమంలోకి చొరబడి అంచనాను వక్రీకరించడం, లేదా దెబ్బ తీయడం చేస్తాయి. అప్పుడు ఆ అంచనా వాస్తవికతకు

దూరంగా ఉంటుంది. ఏ రూపంలోనైనా స్వీయ మానసిక ధోరణికి లోనుగాకుండా ఉండడానికి ఆచరణ నుంచి నేర్చుకోవడమే సరైన పరిష్కారం.

## (2) సమగ్ర దృక్పథం, సమగ్ర పరిశీలన

ప్రకియ లను, ఘటనలను వస్తుగతంగా అంచనా వేయాలంటే వాటిని సమగ్రంగా పరిశీలించడం అవసరం. అటువంటి సమగ్ర పరిశీలన చేసినప్పుడే ఆ ప్రక్రియ లేదా ఘటనలోని ముఖ్య అంశాన్ని గుర్తించగలుగుతాం. అప్పుడే దాని సారాన్ని గ్రహించగలుగుతాం. పరిష్కారం కోసం చేపట్టవలసిన కర్తవ్యాలను నిర్ణయించగలుగుతాం.

సమగ్రత అంటే అన్ని కోణాల నుండి పరిశీలించడం, అన్ని లక్షణాలను, అన్ని స్వభావాలను, అన్ని శక్తులను, అన్ని ప్రభావాలను పరిశీలించడం. తద్వారా అన్ని అంతఃసంబంధాలనూ గ్రహించగలుగుతాం. గతితర్కం అన్ని తరహాలనూ – అంటే, స్థల కాలాలను, భౌతికతను, కార్య, కారణ సంబంధం, రూపం – విషయం, యాదృచ్ఛికత – ఆవశ్యకత వగైరాలను ఉపయోగించి విశ్లేషణ చేయగలుగుతాం. అప్పుడే అ పరిశీలనలో ఉన్న విషయంలోని కీలకమైన అంశాలేమిటో గుర్తించగలుగుతాం. సమగ్ర పరిశీలన లోపించితే, ఏకపక్షంగా, పాక్షికంగా, గందరగోళంగా, పైపైన మాత్రమే చూసే ధోరణులు వస్తాయి. దానివల్ల పరిశీలించే విషయంలోని కీలకమైన అంశాన్ని గుర్తించడంలో విఫలమౌతాం.

## (3) అభివృద్ధి క్రమంలో పరిశీలన

ప్రకియలను, ఘటనలను అవి పరిణామం చెందే క్రమంలో, లేదా అభివృద్ధి చెందే క్రమంలో పరిశీలించాలి. ఆ సందర్భంగా ఆ విషయంలోని అంతర్గత అంశాలను, వాటిలో జరిగే మార్పులను తగు ప్రాధాన్యతతో చూడాలి. ఒకానొక విషయంలోని సారాంశాన్ని వెలికి తీయాలంటే అందులో మార్పులకు మూలంగా వ్యవహరించే అంతర్గత అంశాలను గుర్తించాలి, ఆ మార్పుకు కారణమైన వైరుధ్యాలను విశ్లేషించాలి. "ఒకదానికింకొకటి వేరుగా ఉంటూ, పరస్పరం విరుద్ధంగా వ్యవహరించే అంశాలను మనస్సు, సమాజంతో సహా ప్రకృతిలోని అన్ని ఘటనలలో, ప్రక్రియలలో గుర్తించగలగడమే గతితర్కం యొక్క సారాంశం" -- లెనిన్

## (4) చారిత్రిక దృక్పథం

వాస్తవాన్ని అర్థం చేసుకోవడంలో చారిత్రిక పరిశీలన మొదటి మెట్టు. మనం పరిశీలించే ఘటన, లేదా ప్రక్రియ ఏ కాలంలో, ఎక్కడ (ఏ స్థలంలో) జరిగినదీ. లేదా జరుగుతున్నదీ ముందు గమనించాలి. అదే సమయంలో "దాని వెనుక ఉన్న చారిత్రిక

నేపధ్యాన్ని కూడా గమనంలో ఉంచుకుని పరిశీలించాలి. ఆ ఘటన లేదా ప్రక్రియ చరిత్రలో ఎప్పుడు తలెత్తినదీ, దాని అభివృద్ధి క్రమం ఏతీరుగా సాగుతున్నదీ, అందులో ప్రధాన దశలు ఏమిటి, తెలుసుకుంటేనే దాని ప్రస్తుత స్థితిని సక్రమంగా అర్ధం చేసుకోగలుగుతాము."–– లెనిన్ పుట్టుక, పెరుగుదల, చావు., గతం, వర్తమానం, భవిష్యత్తు., మొదలు, మధ్య, కొస., పాత, కొత్త వంటి భావనలన్నీ చారిత్రిక దృక్పధానికి సంబంధించిన భావనలు.

"నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేయడం" అని లెనిన్ చెప్పినది చారిత్రిక పరిశీలన స్ఫూర్తిని తెలియజేస్తుంది.

చారిత్రిక దృక్పథం కొరవడితే వ్యామోహం, (ఫెటిషిజం) భ్రమలకు లోనుగావడం, జరుగుతున్న పరిణామాల ధోరణులను గమనించలేని గుడ్డితనం కలుగుతాయి.

# ముగింపు

"వాస్తవానికి సంబంధించిన ప్రక్రియల, ఘటనల అభివృద్ధిక్రమానికి మూలమైన అంతర్గత కారణాలను ఆయా నిర్దిష్ట చారిత్రిక పరిస్థితుల నేపథ్యంలో, సామాజిక కార్యాచరణ యొక్క అవసరాలను నెరవేర్చగలిగేలా సమగ్రంగా వస్తుగతంగా విశ్లేషణ చేసినప్పుడే వాటి సారాంశాన్ని వెలికి తీసి వాటిలోని మౌలిక అంశాలను పట్టుకోగలుగుతాం."

"మన రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, విద్యావిషయిక కృషి విజయవంతం కావాలంటే మౌలికమైన లింకు ఏదో నిర్ధారించగల సామర్థ్యం కావాలి. అప్పుడే ప్రతీ దశలోనూ మన మౌలిక కర్తవ్యాలను నిర్ణయించగలుగుతాం."

"ఒక మామూలు కమ్యూనిస్టుగానో, లేదా ఒక విప్లవకారుడిగానో, లేదా సోషలిజానికి కట్టుబడినవాడిగానో ఉంటే చాలదు. ప్రతీ దశలోనూ ఆ క్షణానికి సంబంధించిన నిర్దిష్టమైన లింకును గుర్తించి నీ శక్తినంతా ఉపయోగించి దానిని పట్టుకోవాలి. అప్పుడే పరిణామక్రమం మొత్తం గొలుసులో తర్వాతి లింకును అందుకోగలుగుతావు" అని లెనిన్ అన్నారు.

మార్క్స్ రచన "పెట్టుబడి" ని, లెనిన్ సిద్ధాంత వాద ప్రతివాద రచనలను అధ్యయనం చేస్తే గతితార్కిక పద్ధతిని తెలుసుకోవచ్చు. పెట్టుబడి గ్రంథంలో గతితార్కిక భౌతికవాద విశిష్టత మనకు కానవస్తుంది. లెనిన్ రచనలను అధ్యయనం చేస్తే విప్లవ రాజకీయ కార్యాచరణలో ప్రతీ మలుపులోనూ కీలకమైన లింకు పట్టుకోవడం కనిపిస్తుంది.

# అనుబంధం

గతితార్కిక పద్ధతులను ఉపయోగించి ప్రతీదానినీ అంచనా వేయడం గతి తార్కిక పద్ధతులను 16 అంశాలుగా లెనిన్ వర్గీకరించారు (ఫిలసాఫికల్ నోట్‌బుక్స్, వాల్యూం 38, లెనిన్ సంకలిత రచనలు, 221పే.జీ)

**గతితర్కంలోని మూలాంశాలు**

1. **పరిశీలనలో వస్తుగత తత్వం (ఉన్నది ఉన్నట్టు చూడడం) వాస్తవాల వెలుగులో చూడడం.** ఒకానొక పదార్థాన్ని గాని, ఘటనను గాని దేనికి దాన్నే చూడాలి. ఇంకొక పదార్థం వంటిదే అనో, ఇంకొక ఘటన వంటిదే అనో పోలికను ముందే ఊహించుకుని చూడరాదు. అది జరగాలంటే ఆ పదార్థాన్ని తక్కిన మొత్తం నుంచి వేరు చేసి చూడాలి. గతి తర్కం ప్రకారం దేనినీ పరిసరాలనుండి విడదీసి చూడలేం. కాని, ఆ పదార్థం వాస్తవంగా ఉనికిలో ఉంది గనుక దానిని తక్కిన మొత్తం నుండి విడదీసి అధ్యయనం చేయాలి. ఆ తర్వాతే దానిని తిరిగి దాని పరిసరాల నేపధ్యంలో అధ్యయనం చేయగలం.
2. **అధ్యయనం చేసే విషయం తక్కిన వాటితో కలిగివుండే అనేక రకాల సంబంధాలను అధ్యయనం చేయాలి.** ప్రతీ పదార్థాన్నీ, ప్రక్రియనూ తక్కిన పదార్థంతో, ఘటనలతో దానికి ఉండే పరస్పర సంబంధాల నేపధ్యంలో అంచనా వేయాలి.
3. **అధ్యయనం చేసే విషయం, దాని స్వంత చలనం, దాని స్వంత జీవితం.** ఈ అనంత విశ్వంలో ప్రతీ పదార్థమూ, ప్రతీ ఘటనా అంతర్భాగమే. అదే సమయంలో ప్రతీ పదార్థానికీ, ప్రతీ ఘటనకూ దానికంటూ ఒక క్రమం, ఒక పరిణామం ఉంటాయి. ప్రతీ పదార్థాన్నీ, ఘటననూ దాని స్వంత చలనం, స్వంత జీవితం నేపధ్యంలో అంచనా వేయాలి.
4. **విషయంలో అంతర్గత వైరుధ్య ధోరణులు.** అంతర్గత వైరుధ్యాల ఫలితంగానే పరిణామం, లేదా అభివృద్ధి అనేది జరుగుతుంది. అదే సమయంలో దాని

బాహ్య సంబంధాలు కూడా ప్రభావం చూపుతాయి. ప్రతీ పదార్థంలో, ఘటనలో ఉన్న వైరుధ్య ధోరణులను గుర్తించేందుకు ప్రయత్నించాలి.

5. **విరుద్ధ శక్తుల ఐక్యత మొత్తమే విషయం.** ప్రతీ పదార్థాన్నీ, ప్రతీ ఘటననూ పరస్పరం విరుద్ధంగా ఉండే శక్తుల, అంశాల ఐక్యత మొత్తంగా చూడాలి.

6. **ఈ పరస్పర విరుద్ధ శక్తుల మధ్య పోరాటం ఏ విధంగా పరిణమిస్తున్నదీ, చెరోవైపూ ఏవిధంగా లాగుతున్నదీ చూడాలి.** పరస్పర విరుద్ధ శక్తులమధ్య ఘర్షణను, అది వ్యక్తం అయే వివిధ రూపాలను కూడా పరిశీలించాలి. మనం పరిశీలించే ప్రతీదీ సంక్లిష్టంగానే ఉంటుంది. దానిలో అనేక పార్శ్వాలు తక్కిన పదార్థంతో ముడిపడివుంటాయి.

విశ్లేషణ, సంశ్లేషణ అనే ప్రక్రియలను రెండింటినీ మిళితం చేసి అధ్యయనం చేస్తే ఒక విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. అందుచేత లెనిన్ అంచనా వేసే క్రమాన్ని ఈ దిగువ విధంగా చర్చించాడు:

7. **విశ్లేషణ, సంశ్లేషణల ఐక్యత.** విషయాన్ని చిన్న చిన్న భాగాలుగా విడగొట్టి పరిశీలించడం, ఆ తర్వాత ఆ విడివిడి భాగాలనన్నింటినీ కలిపి ఒక మొత్తంగా చూడడం.

8. **ప్రతీవిషయమూ (పదార్థం, ఘటన వగైరా) బహుముఖాలుగా ఉంటాయి. అంతేగాక సాధారణత్వం కూడా కలిగివుంటాయి. ప్రతీ విషయమూ తక్కిన ప్రతీదానిలో సంబంధం కలిగివుంటుంది.** ప్రతీ పదార్థమూ, ఘటనా, తక్కిన అన్ని పదార్థాలతో, అన్ని ఘటనలతో సంబంధం కలిగివుంటుంది.

9. **కేవలం విరుద్ధ శక్తుల మధ్య ఐక్యతనే కాక, విషయం లోని నిర్ణయాత్మకత, పరిమాణం, గుణం, లక్షణాలు, పార్శ్వాలు, ధర్మాలు వగైరాలన్నీ ఏ విధంగా మార్పు చెందుతున్నాయో చూడాలి.**

10. **కొత్త పార్శ్వాలను, కొత్త సంబంధాలను కనుగొంటూ వుండడం అనేది ఒక నిరంతర ప్రక్రియ.**

11. **పైకి కనిపించే స్వరూపం నుంచి దాని సారాంశం వైపు, ఆ సారాంశంలో కూడా ముందు కనిపించే దానికన్నా మరింత గాఢత వైపుగా మనం విషయాల పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ఒక నిరంతర ప్రక్రియ.**

**12. దేనికదిగా ఉనికిలో ఉండడం నుంచి యాదృచ్ఛికత వైపు, ఒక రూపంలో ఉన్న సంబంధం నుంచి అవతలివైపు నుంచి వచ్చే ప్రతిస్పందన వైపు, మరింత లోతుగా, మరింత సాధారణ రూపం వైపుగా.**

పరస్పర విరుద్ధ శక్తులమధ్య ఘర్షణ ఫలితంగా వచ్చే అభివృద్ధి (జరిగే పరిణామం) నూతన గుణాత్మక స్థితికి దారి తీస్తుంది. ఒక దశ నుండి మరొక దశకు వేసే ఈ విప్లవాత్మక గంతు ప్రధాన లక్షణాలు ఈ దిగువ విధంగా ఉంటాయి

**13. దిగువ దశలో ఉండే కొన్ని ధోరణులు, ధర్మాలు, ఆ పై దశలో కూడా కొనసాగడం**

**14. పైకి చూసినప్పుడు మళ్లీ వెనక్కి వచ్చినట్టు అనిపించడం (అభావం అభావం చెందడం)**

**15. సారం రూపంతో సంఘర్షించడం, అదే మాదిరిగా రూపం సారంతో సంఘర్షించడం, రూపం నాశనం కావడం, సారం పరిణామం చెందడం.**

**16. పరిమాణాత్మకమైన మార్పు గుణాత్మక మార్పుగా మారడం.**

క్లుప్తంగా చెప్పాలంటే పరస్పర విరుద్ధ శక్తుల మధ్య ఐక్యతకు సంబంధించిన సిద్ధాంతమే గతి తర్కం. దీనిని పెంపొందించి వివరించాలి.

***


ప్రతులు : 1000

ప్రచురణ కాలం : ఏప్రిల్, 2024

వెల : ₹ . 20/-

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ

27-13-3, గవర్నర్‌పేట, విజయవాడ - 2,

ఫోన్ నెం. 0866 2577202, 9490098000